E KABURU - Digital News Paper E-PAPER

# ఈ-కబురు

@ekaburu.com
ఎల్లప్పుడూ విశ్వసనీయ సమాచారం

హైదరాబాద్ (తేదీ) 09-03-2026 (వారం) సోమవారం సంపుటి: 02 || సంచిక:66|| పేజీలు–6 www.ekaburu.com

## వరల్డ్ ఛాంపియన్ భారత్



..టీ20 ప్రపంచకప్‌లో సరికొత్త చరిత్ర
.. న్యూజిలాండ్ పై అల్టిమేట్ విక్టరీ

....(మిగతా6లో)



2

## భూసేకరణకు రూ. 5000 కోట్లు

**ఈ కబురు హైదరాబాద్ :**

దక్షిణ తెలంగాణ రైతాంగానికి సాగునీరు అందించడమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం యుద్ధ ప్రాతిపదికన అడుగులు వేస్తోంది. హైదరాబాద్‌లోని జలసౌధలో ఆదివారం ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లా సాగునీటి ప్రాజెక్టులపై మంత్రి ఎన్. ఉత్తమ్ కుమార్ రెడ్డి సమీక్ష నిర్వహించారు.



2

## భారత్ పురోగతిని అడ్డుకోలేరు

**ఈ కుబరు, దిల్లీ:**

భారత దేశ అభివృద్ధిని ఎవరూ అడ్డుకోలేరని విదేశీవ్యవహారాల మంత్రి ఎస్.జైశంకర్ పేర్కొన్నారు. తన బలాల ఆధారంగానే ప్రగతిపథాన్ని భారత్ స్వయంగా నిర్దేశించుకోగలదని, ఇతరుల తప్పిదాలపై అది ఆధారపడి ఉండదని స్పష్టం చేశారు.

## ఇది ఓల్డ్ సిటీ కాదు..
# ఇది ఒరిజినల్ సిటీ

అక్కడ రాత్రంతా వ్యాపారాలు
నిరుద్యోగులకు సీఎం రేవంత్ రెడ్డి శుభవార్త!
నగరాన్ని కాలుష్య రహితంగా మారుస్తాం
చెరువుల రక్షణ కోసం కఠిన నిర్ణయాలు తీసుకోక తప్పదు
నైట్ ఎకానమీని ప్రోత్సహిస్తాం
మూసీ పరిసరాల్లో ఇళ్లు కోల్పోయిన పేదలకు ప్రభుత్వం అన్యాయం చేయదు
ప్రత్యామ్నాయ ఇంటి భరోసా కల్పిస్తాం; సిఎం రేవంత్ రెడ్డి



**ఈ కబురు,హైదరాబాద్ : హైదరాబాద్ నగర అభివృద్ధిపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కీలక వ్యాఖ్యలు చేశారు. నిజాం కాలం నాటి వారసత్వ సంపదను కాపాడుకుంటూనే, ఆధునిక వసతులతో నగరాన్ని ప్రపంచ పటంలో నిలుపుతామని హామీ ఇచ్చారు. బూమ్ రుకున్ ఉద్ దౌలా చెరువు వంటి చారిత్రక కట్టడాలను నిజాం మనకు ఇచ్చిన ఆస్తిగా అభివర్ణించారు.**

"ప్రజా పాలన - ప్రగతి ప్రణాళిక"లో భాగంగా నగరాన్నికాలుష్య రహితంగా మారుస్తామని, నగరవాసులకు స్వచ్ఛమైన గాలి, మంచి వాతావరణం అందించడమే ప్రభుత్వ లక్ష్యమని ఆయన పేర్కొన్నారు. నగర ప్రాధాన్యతను వివరిస్తూ.. "ఇది ఓల్డ్ సిటీ కాదు.. ఇది ఒరిజినల్ సిటీ" అని సీఎం రేవంత్ రెడ్డి వ్యాఖ్యానించారు. నగర అభివృద్ధిలో ఎంఐఎం (MIM) పార్టీ పూర్తి మద్దతు ఇస్తోందని, రాబోయే రోజుల్లో దక్షిణ హైదరాబాద్‌పై ప్రత్యేక దృష్టి సారిస్తామని చెప్పారు. ఆక్రమణకు గురైన చెరువులు, పార్కులు, నాలాలను కాపాడి, వాటిని పర్యాటక కేంద్రాలుగా మారుస్తామని స్పష్టం చేశారు. అంబర్‌పేటలో కబ్జాకు గురైన బతుకమ్మ కుంటను ప్రభుత్వం కఠినంగా వ్యవహరించి పునరుద్ధరించిన విషయాన్ని ఈ సందర్భంగా గుర్తు చేశారు. చెరువుల రక్షణ కోసం ప్రభుత్వం మరిన్ని కఠిన నిర్ణయాలు తీసుకోనుంది. ప్రతి చెరువు వద్ద లేక్ పోలీస్ వ్యవస్థను ఏర్పాటు చేయాలని సీఎం అధికారులను ఆదేశించారు. అలాగే చెరువుల పరిసరాల్లో లేక్ ఎకానమీని సృష్టించనున్నట్లు వెల్లడించారు. దీనివల్ల మహిళా సంఘాలకు ఉపాధి దొరుకుతుందని, అభివృద్ధి చేసిన చెరువుల వద్ద మహిళలు వ్యాపారాలు చేసుకోవచ్చని సూచించారు. మూసీ నదిని కూడా పూర్తిస్థాయిలో ప్రక్షాళన చేసి, అక్కడ రాత్రంతా వ్యాపారాలు చేసుకునేలా నైట్ ఎకానమీని ప్రోత్సహిస్తామని చెప్పారు. నిరుద్యోగులు, వ్యాపారవేత్తలకు మూసీ ఒడ్డున మంచి అవకాశాలు కల్పిస్తామన్నారు. హైడ్రా (HYDRAA) పనితీరుపై స్పందిస్తూ.

....(మిగతా2 లో)

## ఆయుధాలతో నెగ్గలేమని..
## ఆర్థిక యుద్ధం దిశగా
# ఇరాన్ అడుగులు



**....అమెరికాపై అంతర్జాతీయ ఒత్తిడి పెరిగేలా వ్యూహం!**

(......ఆయుధ సంపత్తిలో సాటిరాదు... సాయుధ సంఖ్యలోనూ పోటీలేదు మేధో (ఇంటెలిజెన్స్) పరంగానూ ముందంజ ఏమీ లేదు..... అమెరికా, ఇజ్రాయెల్‌లపై ఏ రకంగా చూసినా ఇరాన్ యుద్ధం నెగ్గలేదు!... అయినా... ఇరాన్ ఎందుకని దాడులకు దిగుతోంది? ... ఏ వ్యూహంతో గల్ఫ్‌లోని తోటి ఇస్లామిక్ దేశాలపై బాంబులతో విరుచుకుపడుతోంది? ... ఎందుకని హర్మ్యూజ్ జలసంధిని కట్టడి చేస్తోంది? .... ఏమిటీ ఇరాన్ దాడుల వెనకున్న ధైర్యం, ఆంతర్యం? .......)

**ఈ కబురు, హైదరాబాద్ ;**

''హర్మ్యూజ్ జలసంధిని మూసేశాం. బ్యారెల్ చమురు ధర ఇప్పుడు 80డాలర్లకు చేరుకుంది. త్వరలోనే ఇది 200 డాలర్లకు చేరుతుంది. మేం ఇకమీదట చమురు పైపులైన్లపై కూడా దాడులు చేస్తాం.'' రెండురోజుల కిందట ఇరాన్ ఐఆర్‌జీసీ అధికార సలహాదారు బ్రిగేడియర్ జనరల్ ఇబ్రహీం జబారీ చేసిన ఈ ప్రకటన పైకి హెచ్చరికలా కనిపిస్తున్నా... ఇది ఇరాన్ యుద్ధ వ్యూహాన్ని బయటపెడుతోంది.

....(మిగతా2లో)

## బెంగాల్ ప్రభుత్వానికి
## ప్రజలే తగిన బుద్ధి చెబుతారు
### ... ప్రధాని మోదీ



ఈ కబురు : రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము పర్యటనలో ప్రొటోకాల్ పాటించకపోవడంపై కేంద్ర ప్రభుత్వం, పశ్చిమ బెంగాల్ ప్రభుత్వం మధ్య వివాదం కొనసాగుతోంది. ఈ విషయంపై ప్రధాని మోదీ స్పందిస్తూ.. టీఎంసీ (TMC)పై మండిపడ్డారు. రాష్ట్రపతి ముర్ము బెంగాల్‌కు వెళ్తే సత్కరించడానికి బదులు..ఆమె పాల్గొనే కార్యక్రమానికి అక్కడి ప్రభుత్వం అనుమతివ్వలేదన్నారు.

....(మిగతా2లో)



## కొత్త హంగులతో తెలంగాణ శాసన మండలి భవనం ప్రారంభం

....(3లో)

## తెలంగాణ పోలీస్ రిట్రీట్2026 ను
## ప్రారంభించిన మంత్రి డి .శ్రీధర్ బాబు

**... పాల్గొన్న మాజీ డిజిపిలు, డిజిపి బి. శివధర్ రెడ్డి**



**ఈ కుబరు,హైదరాబాద్ :**

మారుతున్న కాలానికి అనుగుణంగా నేర పరిశోధనలో అత్యాధునిక కృత్రిమ మేధ సాంకేతికతను పోలీసు శాఖ సమర్థవంతంగా వినియోగించుకోవాలని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు పిలుపునిచ్చారు. ఆర్. బి.వి.ఆర్.ఆర్. తెలంగాణ పోలీస్ అకాడమీలో ఆదివారం నాడు 'తెలంగాణ పోలీస్ రిట్రీట్ 2026' ను మంత్రి ప్రారంభించారు.ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. తాను తొలిసారి శాసనసభ్యుడిగా ఎన్నికైన సమయంలో రాష్ట్రంలో తీవ్రవాదం విస్తృతంగా ఉండేది. పోలీసు అధికారుల అలుపెరగని కృషి, త్యాగాల వల్ల నేడు తీవ్రవాదం అంతమైందన్నారు. సెలవులు కూడా లేకుండా విధులు నిర్వర్తిస్తూ, ఎందరో అధికారులు, సిబ్బంది ప్రాణత్యాగం చేశారనీ ,వారి సేవలకు ఎప్పటికీ గౌరవం ఉంటుందని కొనియాడారు. భవిష్యత్తు సవాళ్లను ఎదుర్కొనేలా పోలీసింగ్ వ్యవస్థను సిద్ధం చేయడమే ఈ రిట్రీట్ ప్రధాన ఉద్దేశమని ఆయన పేర్కొన్నారు. పోలీసు అధికారులు తమ విధి నిర్వహణలో ప్రజలకు వాస్తవంగా

....(మిగతా3లో)

## సీఎం చెప్పిన దాంట్లో తప్పేముంది హరీశ్?



ఈ కబురు, హైదరాబాద్ ;
తెలంగాణ రాజకీయాల్లో విమర్శల పర్వం కొనసాగుతోంది. సీఎం రేవంత్ రెడ్డి మూసీ పునరుజ్జీవనం ప్రాజెక్టు, రీజినల్ రింగు రోడ్డు, కోర్ అర్బన్ రీజియన్‌లో ప్రభుత్వం చేపట్టాలనుకుంటున్న అభివృద్ధి

....(మిగతా2లో)



## గివ్ హర్ స్పేస్' తెలంగాణ జాగృతి నినాదం: కవిత

....(3లో)

## పాలమూరు ప్రాజెక్టులకు డెడ్ లైన్
### .. 2028 డిసెంబర్ కల్లా అన్ని పనులు పూర్తి



**ఈ కబురు,హైదరాబాద్ :**

హైదరాబాద్‌లోని ఎర్రమంజిల్ జలసౌధలో ఆదివారం ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా సాగునీటి ప్రాజెక్టులపై కీలక సమీక్షా సమావేశం జరిగింది. రాష్ట్ర సాగునీటి శాఖ మంత్రి కెప్టెన్ ఎన్. ఉత్తమ్ కుమార్ రెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ భేటీలో ఎక్సైజ్ శాఖ మంత్రి వాకిటి శ్రీహరి, ఇతర ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు. ఉమ్మడి పాలమూరు జిల్లాలోని పెండింగ్ ప్రాజెక్టులను త్వరితగతిన పూర్తి చేసి సాగునీటి రంగాన్ని బలోపేతం చేయడమే ఈ సమావేశం ప్రధాన ఉద్దేశం. తెలంగాణ ఏర్పడిన తర్వాత ఈ ఖరీఫ్ సీజన్‌లోనే అత్యధికంగా వరి సాగు జరిగిందని, కృష్ణా జలాలను సమర్థవంతంగా వినియోగించుకుంటామని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి స్పష్టం చేశారు.

....(మిగతా2లో)



## 'స్వయం' బ్రాండ్ ఉత్పత్తులకు నేనే బ్రాండ్ అంబాసిడర్

....(3లో)



## విద్యార్థినులకు ఈవీ స్కూటీలు
# ఇవ్వాలనుకుంటున్నాం

**మహిళల ఆర్థిక శక్తి పెరిగినప్పుడే దేశం అభివృద్ధి చెందుతుంది**

**హైదరాబాద్‌లో వంద శాతం ఈవీ బస్సులను తెస్తున్నాం**

**గాంధీ విగ్రహానికి రూ.70 కోట్లే ఖర్చు; సిఎం రేవంత్ రెడ్డి**

**ఈ కబురు, హైదరాబాద్:**

హైదరాబాద్‌ను కాలుష్య రహిత నగరంగా మార్చుతున్నట్లు సీఎం రేవంత్ రెడ్డి చెప్పారు. రెడ్, ఆరెంజ్ కేటగిరి పరిశ్రమలను ఓఆర్ఆర్ బయటకు పంపిస్తామని అన్నారు. ప్రజాభవన్‌లో నిర్వహించిన మహిళా దినోత్సవ కార్యక్రమంలో సీఎం పాల్గొన్నారు.''మహిళా జర్నలిస్టులతో కలిసి ఈ కార్యక్రమాన్ని నిర్వహించుకోవడం సంతోషంగా ఉంది. మహిళలకు సరైన గుర్తింపు ఇవ్వాలని ఈ ప్రభుత్వం భావిస్తోంది

....(మిగతా2లో)

ఈ-కబురు

09- 03 -2026
సోమవారం
E-kaburu.com

# “ఇది ఓల్డ్ సిటీ కాదు.. ఇది ఒరిజినల్ సిటీ”



ప్రారంభంలో కూల్చివేతల సమయంలో చాలామంది విమర్శించారని, కానీ ఇప్పుడు చెరువులు కబ్జా కోరల నుంచి విముక్తి చెందుతుంటే ప్రజలంతా సంతోషిస్తున్నారని సీఎం అన్నారు. మూసీ పరిసరాల్లో ఇళ్లు కోల్పోయిన పేదలకు ప్రభుత్వం అన్యాయం చేయదని, వారికి ప్రత్యామ్నాయ ఇళ్లు ఇస్తామని భరోసా ఇచ్చారు. రంజాన్ పండుగ వేళ పాతబస్తీ అభివృద్ధి కోసం మరిన్ని నిధులు విడుదల చేస్తామని, అక్కడ జరుగుతున్న అభివృద్ధి పనులే ప్రభుత్వ చిత్తశుద్ధికి నిదర్శనమని రేవంత్ రెడ్డి పేర్కొన్నారు.

# బెంగాల్ ప్రభుత్వానికి

## ప్రజలే తగిన బుద్ధి చెబుతారు

### ... ప్రధాని మోదీ



ఇటువంటి చర్యలతో మమత ప్రభుత్వం రాష్ట్రపతిని మాత్రమే కాకుండా భారత రాజ్యాంగాన్ని కూడా అవమానించిందని అన్నారు. ద్రౌపదీ ముర్ము ఎంతో కష్టపడి దేశంలోని అత్యున్నత స్థానానికి ఎదిగారని మోదీ పేర్కొన్నారు. ముర్ముకి రాజకీయాలు చేసే తృణమూల్‌కు బెంగాల్ ప్రజలు త్వరలోనే తగిన బుద్ధి చెబుతారన్నారు. త్వరలో జరగనున్న బెంగాల్ ఎన్నికల్లో విజయం సాధించేది భాజపానేనని ధీమా వ్యక్తం చేశారు. మరోవైపు కేంద్ర ప్రభుత్వం కుట్రపూరితంగానే తప్పుడు ఆరోపణలు చేస్తోందని బెంగాల్ సీఎం మమతా బెనర్జీ ఆరోపించారు. ఎన్నికల్లో విజయం కోసం భాజపా దేశంలోని అత్యున్నత పదవిని దుర్వినియోగం చేస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్రపతి స్థానాన్ని తాము గౌరవిస్తామన్నారు. ఆ కార్యక్రమంలో ద్రౌపదీ ముర్ము పాల్గొంటారనే విషయంపై ఎటువంటి ముందస్తు సమాచారం లేదన్నారు.

# భూసేకరణకు రూ. 5000 కోట్లు

ఈ సమావేశంలో మంత్రులు జూపల్లి కృష్ణారావు, వాకిటి శ్రీహరి సహా పలువురు ఉన్నతాధికారులు పాల్గొన్నారు. రాబోయే 30 నెలల వ్యవధిలో పాలమూరురంగారెడ్డి ప్రాజెక్టును పూర్తి చేస్తామని, అలాగే 2027 మార్చి నాటికి కల్వకుర్తి, నెట్టెంపాడు, భీమా, కోయిల్ సాగర్ ప్రాజెక్టులను పూర్తి చేసి రైతులకు సమృద్ధిగా నీరు అందిస్తామని మంత్రి హామీ ఇచ్చారు.ప్రాజెక్టులను వేగవంతం చేసేందుకు ప్రభుత్వం భారీగా నిధులు కేటాయించింది. కల్వకుర్తికి రూ. 909 కోట్లు, నెట్టెంపాడుకు రూ. 252 కోట్లు, భీమాకు రూ. 200 కోట్లు, కోయిలసాగర్‌కు రూ. 185 కోట్లు కేటాయించినట్లు మంత్రి వివరించారు. ముఖ్యంగా భూసేకరణ పనులకు అత్యున్నత ప్రాధాన్యత ఇస్తూ, జూన్ 2 నాటికి రూ. 5000 కోట్లు విడుదల చేయాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నిర్ణయించినట్లు వెల్లడించారు. గత పదేళ్లలో బీఆర్ఎస్ ప్రభుత్వం ఈ ప్రాజెక్టులను తీవ్రంగా నిర్లక్ష్యం చేసిందని, అంచనాలను పెంచి నిధులు వృథా చేసిందని ఆయన ధ్వజమెత్తారు.పాలమూరురంగారెడ్డి ప్రాజెక్టు ఆఫ్‌టేక్ పాయింట్‌ను జూరాల నుంచి శ్రీశైలానికి మార్చడం వల్ల రాష్ట్రానికి భారీ నష్టం వాటిల్లిందని ఉత్తమ్ కుమార్ రెడ్డి పేర్కొన్నారు. గత ప్రభుత్వం రూ. 27,000 కోట్లు ఖర్చు చేసినా ఒక్క ఎకరానికి కూడా నీరు ఇవ్వలేకపోయిందని విమర్శించారు. ప్రస్తుత ప్రభుత్వ హయాంలో డిసెంబర్ 7 నుండి ఇప్పటివరకు ఈ ప్రాజెక్టుపై రూ. 7161 కోట్లు ఖర్చు చేశామని వెల్లడించారు. అంచనాలు పెరిగినా సరే, ఈ ప్రాజెక్టును పూర్తి చేసి తీరుతామని ఆయన స్పష్టం చేశారు.ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టులో పేరుకుపోయిన మట్టిని తొలగించేందుకు (డీసిల్టింగ్) తక్షణమే పనులు ప్రారంభించాలని అధికారులను మంత్రి ఆదేశించారు. మట్టి పేరుకుపోవడం వల్ల ప్రాజెక్టు నిల్వ సామర్థ్యం 11.94 టీఎంసీల నుండి 9 టీఎంసీలకు తగ్గిందని, దీన్ని పునరుద్ధరించాల్సిన అవసరం ఉందన్నారు. కృష్ణా నదిపై తెలంగాణకు ఉన్న హక్కులను కాపాడుకుంటూనే, వ్యవసాయ రంగంలో రికార్డు స్థాయి పురోగతి సాధిస్తామని, గత ఖరీఫ్‌లో 148.5 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం ఉత్పత్తి సాధించడమే ఇందుకు నిదర్శనమని మంత్రి పేర్కొన్నారు.

# బంగ్లాదేశ్‌లో దారుణం

## ..పూజ చేసుకుంటున్న వారిపై బాంబులు





ఈ కబురు : బంగ్లాదేశ్‌లో హిందువులపై దాడులు రోజురోజుకూ తీవ్రమవుతున్నాయి. తాజాగా మరో ఘటన చోటుచేసుకుంది. కోమిల్లా ప్రాంతంలో శనివారం పూజ చేసుకుంటున్న హిందువుల బృందంపై గుర్తు తెలియని దుండగులు బాంబులు విసిరారు. భయభ్రాంతులకు గురైన ప్రజలు పరుగులు పెట్టారు. పూజా కార్యక్రమానికి హాజరైన పలువురు ఈ ఘటనలో గాయపడినట్లు స్థానిక మీడియా వర్గాలు వెల్లడించాయి. పూజారి కేశవ్ చక్రవర్తి పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలుస్తోంది. కేసు నమోదు చేసుకొని నిందితుల కోసం గాలిస్తున్నట్లు పోలీసులు తెలిపారు. బంగ్లాదేశ్ విద్యార్థి నాయకుడు ఉస్మాన్ హాదీ హత్యతో ఆ దేశంలో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్న సంగతి తెలిసిందే. అప్పటి నుంచి దేశంలోని హిందువులపై దాడులు జరుగుతున్నాయి. ఈ దాడుల్లో ఇప్పటివరకు పదుల సంఖ్యలో హిందువులు ప్రాణాలు కోల్పోయారు.

## ఆయుధాలతో నెగ్గలేమని.. ఆర్థిక యుద్ధం దిశగా

# ఇరాన్ అడుగులు



**––ఏకాకిగా మిగిలిపోకుండా...**

మామూలుగానైతే ఈ యుద్ధం ఇరాన్‌కు అమెరికాఇజ్రాయెల్ కూటమికి మధ్యలోనే సాగితే... ఖమేనీ దేశం ఏకాకిగా మిగిలిపోతుంది. చైనా, రష్యా, ఉత్తరకొరియాల నుంచి మద్దతు ఉన్నా... అది యుద్ధంలో ఇరాన్‌కు ఎంతమేరకు ప్రత్యక్షంగా ఉపయోగపడుతుందనేది ప్రశ్నే! ప్రస్తుత పరిస్థితుల్లో ఆయా దేశాలు ఇరాన్ తరపున రంగంలోకి దిగే అవకాశాలు తక్కువ. ఇరాన్ పరిస్థితి పట్ల సానుభూతి, అమెరికా తీరుపట్ల ప్రపంచదేశాల్లో ఆగ్రహం ఉన్నా... అది కూడా పనికొచ్చేదేమీ కాదు. ప్రేక్షకపాత్ర పోషించటం తప్ప ఏమీ చేయలేని అశక్తతే! ఎంత తల ఎగరేసినా... క్షిపణులతో విరుచుకుపడ్డా... కొద్దిరోజుల్లో అమెరికా బలం, బలగం ముందు లొంగిపోవాల్సిందే!

**––అలాకాకుండా...**

చమురు దారులను కట్టడి చేస్తే... ఇరుగుపొరుగు దేశాల్లోని చమురు కేంద్రాలపై దాడులు చేస్తే... గల్ఫ్ దేశాలకూ, అక్కడి ప్రజలకూ, ఆర్థిక వ్యవస్థలకూ దెబ్బతగిలితే... ప్రపంచవ్యాప్తంగా ఇంధన ధరలు పెరిగితే... ఈ యుద్ధంతో సంబంధం లేని దేశాలూ.. ఒత్తిడికి గురవ్వాల్సిన పరిస్థితి! చమురు ధరలు పెరిగినా... ఎగుమతులు తగ్గినా... ప్రపంచంలోని ప్రజలందరికీ ఆ చురకంటుతుంది. అన్ని దేశాల ఆర్థిక వ్యవస్థలూ అతలాకుతలం అవుతాయి.

**––సబ్‌సీ కేబుల్స్‌పైనా?...**

హర్మూజ్ జలసంధి ద్వారా రోజుకు 25 లక్షల బ్యారెల్స్ చమురు దిగుమతి చేసుకునే భారత్‌కు, 22% ఎల్‌పీజీ దిగుమతి చేసుకునే ఐరోపాకు, 70శాతం ఈ జలసంధి ద్వారానే చమురు తీసుకునే జపాన్, దక్షిణకొరియాలకు, ఇక ఇరాన్ చమురుపై భారీగా ఆధారపడ్డ చైనాకూ, చివరకు అమెరికాకూ... ఇరాన్ యుద్ధవేడి తగులుతుంది. ఇలా ఇరాన్ ఎక్కడుందో తెలియని దేశాల ప్రజలూ ధరలు పెరిగి గిలగిలలాడతారు. ఎగుమతులకు దారులు మూసుకు పోతుండటంతో చమురు కేంద్రాలను ఇరాక్ మూసేస్తోంది. ఇలా ప్రపంచ మానవాళి జీవనాడిలా వ్యవహరిస్తున్న చమురు సరఫరా, పెట్రోలియం ఉత్పత్తులను లక్ష్యంగా చేసుకోవటం ద్వారా... తలెత్తే అపార ఆర్థిక ఒత్తిడి మామూలుగా ఉండదు. ఇది కేవలం ఆయా దేశాలకే పరిమితమూ కాదు. దిల్లీలో, బీజింగ్‌లో, టోక్యోలో... సియోల్‌లో, బ్రసెల్స్‌లో... ఆందోళన గంటలు మోగిస్తుంది. అవన్నీ అంతిమంగా వాషింగ్టన్‌లో ప్రతిధ్వనిస్తాయి! సంక్షోభంలో ప్రపంచ దేశాలూ తలదూర్చాల్సిన పరిస్థితి తలెత్తుతుంది. తద్వారా ట్రంప్‌పై ఒత్తిడి పెరుగుతుంది. అలా ఆర్థిక వాత పెట్టి... అమెరికా ఆగ్రహానికి పగ్గాలు వేయాలన్నది ఇరాన్ అనుసరిస్తున్న వ్యూహంలా కనిపిస్తోంది. కేవలం చమురుతోనే ఆగిపోకుండా... డేటా కేంద్రాలు, ప్రపంచ ఆర్థిక, మౌలిక వ్యవస్థలన్నింటికీ కీలకమైన సముద్రమార్గంలోని సబ్‌సీ కేబుల్స్‌పై కూడా ఇరాన్ దాడులు చేసే అవకాశాలున్నాయి. ఇప్పటికే బహ్రెయిన్‌లోని డేటా కేంద్రాలపై దాడులు జరిగాయి. సముద్రగర్భంలోని కేబుళ్లకూ యుద్ధ దెబ్బ తగిలితే... అనేక దేశాల్లో ఆర్థిక, కమ్యూనికేషన్ వ్యవస్థలు అస్తవ్యస్తమవుతాయి.

--హర్మూజ్ జలసంధిని కట్టడిచేసినా..

ఇరాన్ ఇలా.. ప్రత్యామ్నాయాలన్నింటినీ చూసుకుంటూ... సైనిక పరంగా అమెరికాఇజ్రాయెల్‌లతో యుద్ధాన్ని నెగ్గలేనన్న సంగతి గుర్తించి తెలివిగా ఈ యుద్ధాన్ని ఆయుధమార్గం నుంచి ఆర్థికమార్గం పట్టించే దిశగా అడుగులు వేసింది. హర్మూజ్ జలసంధిని కట్టడి చేసినా... గల్ఫ్ దేశాలపై పదేపదే దాడులు చేస్తున్నా... కారణమదే! అంతేతప్ప యుద్ధం గెలుస్తామనో... అమెరికాను తిప్పికొడతామనో ధైర్యంతో ఏమాత్రం కాదు. ఇతర దేశాలకు కాక తగిలి దౌత్య రాయబారాలు మొదలయ్యేది ఎప్పుడు... ట్రంప్ పెట్టే షరతులెలా ఉంటాయి... వాటికి ఇరాన్ ఎలా స్పందిస్తుంది... ఈ లోపు ఇరాన్‌లో అంతర్గత పరిస్థితులు... ఇవన్నీ ఆసక్తికరాంశాలు! ఇరాన్‌పై అమెరికాఇజ్రాయెల్ క్షిపణులు ఆగితే యుద్ధం ఆగిపోవచ్చు! కానీ గల్ఫ్ దేశాల చమురు కేంద్రాలపై దాడులతో ఇరాన్ మొదలెట్టిన ఆర్థికయుద్ధం ప్రభావం ఎంతకాలం ఉంటుందనేదే కీలకం!

# విద్యార్థినులకు ఈవీ స్కూటీలు ఇవ్వాలనుకుంటున్నాం

పోలీస్ సహా అవకాశం ఉన్న ప్రతి విభాగంలో మహిళ అధికారులకు బాధ్యతలు అప్పగిస్తున్నాం. మహిళల ఆర్థిక శక్తి పెరిగినప్పుడే దేశం అభివృద్ధి చెందుతుంది’’. ‘హైదరాబాద్‌లోని డీజిల్ బస్సులను 2026 డిసెంబర్‌లోపు జిల్లాలకు తరలిస్తాం. హైదరాబాద్‌లో వంద శాతం ఈవీ బస్సులను తెస్తున్నాం. డిసెంబర్ 9లోపు నగరంలో డీజిల్ బస్సులు ఉండవు. హైదరాబాద్‌లో ఏసీ ఈవీ బస్సులు తెస్తాం. కళాశాలలకు వెళ్లే విద్యార్థినులకు ఈవీ స్కూటీలు ఇవ్వాలనుకుంటున్నాం’’ అని సీఎం అన్నారు.

--గాంధీ విగ్రహానికి రూ.70 కోట్లే ఖర్చు

“గాంధీ విగ్రహ నిర్మాణానికి రూ.500 కోట్లు అవుతుందని తప్పుడు ప్రచారం చేస్తున్నారు. ఆ విగ్రహానికి రూ.70 కోట్లే ఖర్చు అవుతుంది. గాంధీ విగ్రహం వద్ద విజ్ఞాన మందిరానికి రూ.100 కోట్లు ఖర్చు చేస్తున్నాం. హైదరాబాద్‌లో కాలుష్యం, దోమలు ఎక్కువగా ఉన్నాయంటున్నారు. మూసీని ప్రక్షాళన చేస్తామంటే అడ్డుపడుతున్నారు. మూసీ ప్రక్షాళన వద్దంటున్నారా.. తొలగింపులు వద్దంటున్నారో స్పష్టత ఇవ్వండి. నష్టపరిహారం ఇచ్చే బఫర్ జోన్‌లోని ఇళ్లను తొలగిస్తాం. నిర్వాసితులకు ప్రత్యామ్నాయం చూపిస్తాం’’ అని రేవంత్‌రెడ్డి అన్నారు.




# భారత్ పురోగతిని అడ్డుకోలేరు



దిల్లీలో కొనసాగుతున్న ‘రైసినా డైలాగ్’ కార్యక్రమంలో మంత్రి శనివారం ప్రసంగించారు. రెండు రోజుల క్రితం ఇదే కార్యక్రమంలో పాల్గొన్న అమెరికా విదేశాంగ శాఖ ఉప మంత్రి క్రిస్టఫర్ లాన్‌డౌ చేసిన వ్యాఖ్యలకు జైశంకర్ ఈ విధంగా స్పందించారు. ‘అమెరికా గతంలో చేసిన సహాయం వల్లే చైనా మాకు ప్రధాన పోటీదారుగా ఎదిగింది. భారత్‌కు అలాంటి ఆర్థిక ప్రయోజనాలను సమకూరనివ్వం. చైనా విషయంలో జరిగిన పొరపాటును పునరావృతం కానివ్వం’ అని కిస్టఫర్ లాన్‌డౌ పేర్కొన్నారు. దీనిపై జైశంకర్ దీటుగా స్పందించారు. భారత్ వృద్ధిని హిందూమహా సముద్రంలోని పరిస్థితులతో కలిపి విశ్లేషిస్తూ...‘తమ దేశంతో కలిసి పనిచేసిన వారు అధిక ప్రయోజనాన్ని పొందుతారు. భారత్ వృద్ధి పథానికి సవాళ్లు లేవని అనడంలేదు. అవి ఉన్నా సరే తన పురోగమనాన్ని భారత్ స్పష్టంగా నిర్దేశించుకుంది. దానిని ఎవరూ ఆపలేరు’ అని జైశంకర్ స్పష్టం చేశారు.

--ఇరాన్ నౌకకు కొచ్చిన్‌లో ఆశ్రయానికి సమర్థన

శ్రీలంక తీరంలో ఇరాన్ యుద్ధ నౌక ఐరిస్ దేనాపై అమెరికా దాడిని ప్రస్తావిస్తూ.... ‘విశాఖపట్నంలో జరిగిన ఇంటర్నేషనల్ ఫ్లీట్ రివ్యూ (ఐఎఫ్ఆర్), మిలాన్ 2026కు వచ్చిన పలు ఇరాన్ యుద్ధ నౌకలు అనుకోకుండా యుద్ధ ప్రభావానికి గురయ్యాయి. అవి యుద్ధంలో పాల్గొనడానికి రాకపోయినా ప్రస్తుత ఉద్రిక్త పరిస్థితుల వల్ల సమస్యలు ఎదుర్కొంటున్నాయి. ఐరిస్ లావన్ అనే మరో నౌకలో సాంకేతిక సమస్య తలెత్తగా దానిని అత్యవసరంగా నిలపడానికి ఇరాన్ విజ్ఞప్తి చేసింది. చట్టపరమైన ఇబ్బందులు ఉన్నప్పటికీ మానవతా దృక్పథంతో భారత్ అనుమతి మంజూరు చేసింది. ఈ నెల 4న కొచ్చిన్‌లో నిలిపిన నౌకలోని 183 మంది సిబ్బందికి అక్కడే ఆశ్రయమిచ్చాం. ఈ విషయంలో భారత్ సరైన నిర్ణయమే తీసుకుంద’ని జైశంకర్ తెలిపారు.

--భవిష్యత్తులో బహుళ ధ్రువ ప్రపంచం

ప్రపంచం భవిష్యత్తులో మరింత బహుళ ధ్రువ వ్యవస్థకు మారనుందని విదేశీ వ్యవహారాల మంత్రి జైశంకర్ పేర్కొన్నారు. ప్రపంచంలో ఏ దేశం కూడా అన్ని రంగాలపై సంపూర్ణ ఆధిపత్యం కలిగి ఉండలేదని చెప్పారు. పెద్ద దేశాలు ప్రపంచానికి విధివిధానాలు నిర్ణయించే యుగం ముగిసిందని అభిప్రాయపడ్డారు. బహుళ ధ్రువ (మల్టీపోలార్) వ్యవస్థ...బహుపాక్షికతకు (మల్టీలేటరలిజం) వ్యతిరేకం కాదన్నారు. బహు పాక్షికత విజయవంతం కావాలంటే బహుళ ధ్రువ వ్యవస్థ బలహీనపడాల్సిన అవసరం లేదని స్పష్టం చేశారు.

# సీఎం చెప్పిన దాంట్లో తప్పేముంది హరీశ్?



ఈ కబురు, హైదరాబాద్ ;

తెలంగాణ రాజకీయాల్లో విమర్శల పర్వం కొనసాగుతోంది. సీఎం రేవంత్ రెడ్డి మూసీ పునరుజ్జీవనం ప్రాజెక్టు, రీజినల్ రింగు రోడ్డు, కోర్ అర్బన్ రీజియన్‌లో ప్రభుత్వం చేపట్టాలనుకుంటున్న అభివృద్ధి పనులకు ప్రతిపక్ష బీఆర్ఎస్ పార్టీ అడుగడుగునా అడ్డుపడుతున్నట్టు తెలుస్తోంది. ఫ్యూచర్ సిటీకి అనుసంధానంగా చేపడుతున్న ప్రాజెక్టుల్లో భాగంగా కొందరి ఇండ్లను హైడ్రా అధికారులు, జీహెచ్ఎంసీ సంయుక్తంగా తొలగిస్తూ వస్తున్నది.దీంతో గూడు కోల్పోయిన కొందరు ప్రభుత్వానికి వ్యతిరేకంగా మాట్లాడుతున్నారు. వారికి మద్దతుగా నిలబడిన బీఆర్ఎస్ నేతలు వారిని అడ్డం పెట్టుకుని కుటిల రాజకీయాలకు తెరలేపినట్టు ప్రచారం జరుగుతోంది.

--కూల్చకుండా.. కట్టకుండా అభివృద్ధి ఎలా?

అభివృద్ధి అనేది పాతవి కూల్చకుండా, కొత్తవి కట్టకుండా ఎలా సాధ్యం అని అధికార పార్టీ నేతలు అంటున్నారు. గత బీఆర్ఎస్ పాలనలో హైటెక్ సిటీ ప్రాంతంలో కొండలను తొలచి బహుళ అంతస్థులను నిర్మించినప్పుడు కూల్చివేతలు గుర్తుకురాలేదా? అని హస్తం పార్టీ నేతలు ప్రశ్నిస్తున్నారు. అభివృద్ధి పనుల్లో భాగంగా ఇండ్లు, షాపులు, భూములు కోల్పోతున్న వారికి నష్టపరిహారం చెల్లిస్తామని ప్రభుత్వం చెబుతున్నది. అయినప్పటికీ ప్రతిపక్ష బీఆర్ఎస్ మాత్రం బాధితులను అడ్డం పెట్టుకుని నష్టపరిహారం అనే అంశాన్ని పక్కకు జరిపి ఎమోషనల్ పాలిటిక్స్ చేస్తున్నట్టు తెలుస్తున్నది. బీఆర్ఎస్ హయాంలో డబుల్ బెడ్రూం ఇండ్ల పేరిట కూల్చివేతలు చేపట్టి నిరుపేదలను రోడ్డున పడేసినప్పుడు ఇవన్నీ గుర్తుకురాలేదా? అప్పుడు వారు కూడా ఇలాగే రోదించారు? ఏండ్లు గడుస్తున్నా పేదలకు డబుల్ బెడ్రూమ్స్ ఇచ్చారా? పేదల పేరిట బీఆర్ఎస్ నాయకులకు, కమీషన్లకు అమ్ముకున్నారని కాంగ్రెస్ నేతలు విమర్శిస్తున్నారు.

--మూసీ పునరుజ్జీవం ఎందుకు చేయలేదు?

బీఆర్ఎస్ రాష్ట్రంలో పదేండ్లు అధికారంలో ఉన్నది. ఆనాడు హుస్సేన్ సాగర్ శుద్ధి,మూసీ పునరుజ్జీవంలో భాగంగా రూ. వేల కోట్లు ఖర్చు చేసిన బీఆర్ఎస్ కంటితుడుపు చర్యగా వ్యవహరించింది. నిధులు మాత్రం ఖర్చు అయ్యాయి, మూసీ పునరుజ్జీవం మాత్రం జరగలేదు. హైదరాబాద్‌లో సరైన డ్రెయినేజీ వ్యవస్థ లేకపోవడం వల్లే మొత్తం పూర్తి చేయలేకపోయామని, మాస్టర్ ప్లాన్ రెడీ చేశాక కంప్లీట్ చేస్తామని నాడు బీఆర్ఎస్ పేర్కొన్నది. పదేండ్లలో అటు మాస్టర్ ప్లాన్, ఇటు పునరుజ్జీవం రెండూ పూర్తికాలేదు. నాడు గులాబీ పార్టీ మధ్యలో వదిలేసిన ప్రాజెక్టును ఇప్పుడు కాంగ్రెస్ సర్కారు చేపట్టింది.తాము చేపట్టిన ప్రాజెక్టును కొనసాగిస్తున్నందుకు అభినందించాల్సింది పోయి బీఆర్ఎస్ నేతలు కేటీఆర్, హరీశ్ రావులు విమర్శించడాన్ని కాంగ్రెస్ శ్రేణులు తీవ్రంగా తప్పుబడుతున్నారు. ఇదిలాఉండగా, కోర్ అర్బన్ సిటీలో ఎకో పార్క్ ప్రారంభోత్సవంలో సీఎం రేవంత్ మాట్లాడుతూ.. అభివృద్ధి కావాలంటే కొన్నింటిని వదులకోవాల్సింది ఉంటుందని, బాధితులకు నష్టపరిహారం అందిస్తామని స్పష్టంచేశారు. అయినా, వినకుండా బీఆర్ఎస్ నేతలు ప్రభుత్వంపై బురద జల్లుతున్నారని.. నగర విస్తరణ, అభివృద్ధి జరిగితేనే పెట్టుబడులు, పరిశ్రమలు, కంపెనీలు వస్తాయని, ఉద్యోగావకాశాలు మెరుగవుతాయని సీఎం గుర్తుచేశారు.రాష్ట్రంలో విధ్వంసం జరగడం లేదని,పాతవి కూల్చి కొత్తవి కడుతున్నామని చెప్పారు.ఈ విషయాన్ని ఎన్నిసార్లు చెప్పినా ప్రతిపక్షాలు రాజకీయం చేస్తున్నాయని సీఎం అసహనం వ్యక్తం చేశారు.ఇదే విషయంపై కాంగ్రెస్ శ్రేణులు సైతం సీఎం రేవంత్‌కు అండగా నిలుస్తూ..ప్రభుత్వం ఏం చేయాలనుకుంటున్నదో ప్రజలకు వివరించేందుకు ప్రయత్నిస్తున్నారు.

## పాలమూరు ప్రాజెక్టులకు డెడ్ లైన్ .. 2028 డిసెంబర్ కల్లా అన్ని పనులు పూర్తి: ఉత్తమ్ కుమార్ రెడ్డి



పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకంపై గత ప్రభుత్వం తప్పుడు ప్రచారం చేస్తోందని మంత్రి విమర్శించారు. రూ. 55 వేల కోట్ల ప్రాజెక్టులో కేవలం రూ. 27 వేల కోట్లు ఖర్చు చేసి, 90 శాతం పనులు పూర్తయ్యాయని చెప్పడం హాస్యాస్పదమని మండిపడ్డారు. ప్రాజెక్టు అంచనాలను రూ. 84 వేల కోట్లకు పెంచినప్పటికీ, ఒక్క ఎకరానికి కూడా నీరు ఇవ్వలేదని ధ్వజమెత్తారు. జూరాల నుంచి శ్రీశైలానికి ప్రాజెక్టును మార్చడం వల్ల జిల్లాకు తీరని అన్యాయం జరిగిందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రాజెక్టుల భూసేకరణ కోసం జూన్ 2వ తేదీలోపు రూ. 5 వేల కోట్లు ఖర్చు చేస్తామని, నిధులను గ్రీన్ ఛానల్ ద్వారా విడుదల చేసి 2028 డిసెంబర్ నాటికి అన్ని పనులను పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు.వచ్చే మార్చి, ఏప్రిల్ నాటికి ప్రాజెక్టు పనులు పరుగులు పెట్టాలని అధికారులను ఆదేశించినట్లు మంత్రి వాకిటి శ్రీహరి తెలిపారు. గత పదేళ్లుగా పాలమూరు ప్రాజెక్టులను నిర్లక్ష్యం చేసినందుకే ప్రజలు ఎన్నికల్లో తగిన గుణపాఠం చెప్పారని పేర్కొన్నారు. జూరాల బ్రిడ్జి భద్రత దృష్ట్యా దానిపై వాహనాల రాకపోకలను నిలిపివేస్తామని, ప్రజాభిప్రాయం మేరకే ఈ విషయంలో ముందుకెళ్తామని స్పష్టం చేశారు. పాలమూరు ప్రజలు కన్న సాగునీటి కలలను తమ ప్రభుత్వం తప్పకుండా నెరవేరుస్తుందని ధీమా వ్యక్తం చేశారు

# పారిశుద్ధ్య కార్మికులకు చీరలు పంపిణీ చేసిన ..ఆంజనేయులు సాగర్



పారిశుద్ధ్య కార్మికులతో అంజనేయులు సాగర్



మహిళా కార్మికులకు చీరలు అందజేస్తున్న ఆంజనేయులు సాగర్

**అంజయ్య నగర్ లో ఘనంగా మహిళా దినోత్సవ వేడుకలు**

ఈకబురు, శేరిలింగంపల్లి : అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా అంజయ్య నగర్ డివిజన్ పరిధిలోని అంజయ్య నగర్ కాలనీలో నిత్యం శానిటేషన్ సేవలు అందిస్తున్న మహిళా సిబ్బందిని అంజయ్య నగర్ డివిజన్ నాయకులు ఆంజనేయులు సాగర్ ఘనంగా సన్మానించారు. పారిశుద్ధ్య కార్మికుల సేవలను గుర్తు చేసుకుంటూ వారిని శాలువాలతో సత్కరించడంతో పాటు చీరలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆంజనేయులు సాగర్ మాట్లాడుతూ ప్రతి రోజు మన కాలనీలను పరిశుభ్రంగా ఉంచుతూ ప్రజల ఆరోగ్యం కోసం అహర్నిశలు కష్టపడుతున్న శానిటేషన్ మహిళా సిబ్బంది సేవలు అమూల్యమైనవని తెలిపారు. వారి కృషి కారణంగానే పరిసరాలు శుభ్రంగా ఉండి ప్రజలు ఆరోగ్యంగా జీవించగలుగుతున్నారని అన్నారు. మహిళా దినోత్సవం సందర్భంగా వారి సేవలకు గౌరవ సూచకంగా ఈ చిన్న సత్కారం నిర్వహించినట్లు పేర్కొన్నారు. అలాగే డివిజన్ వాసుల తరపున ప్రతి మహిళా శానిటేషన్ సిబ్బందికి హృదయపూర్వక అభినందనలు తెలియజేస్తూ, వారికి మహిళా దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో శానిటేషన్ ఎస్ఎఫ్ఐ రమేష్, సుదిశ్, శ్రవణ్, కాలనీవాసులు రామకృష్ణ, రోహిత్ తదితరులు పాల్గొన్నారు.

# సమాజ అభివృద్ధిలో మహిళలు కీలక పాత్ర పోషించాలి : పల్లపు సురేందర్



హిళా దినోత్సవ వేడుకల్లో మహిళలతో కలిసి పల్లపు సురేందర్



క్రీడల్లో గెలుపొందిన మహిళలకు బహుమతులు అందజేస్తున్న దృశ్యం

**నల్లగండ్ల డివిజన్ లో ఘనంగా మహిళా దినోత్సవ వేడుకలు**

ఈకబురు, శేరిలింగంపల్లి : నల్లగండ్ల డివిజన్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు పల్లపు సురేందర్ ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. నల్లగండ్ల డివిజన్ వ్యాప్తంగా నిర్వహించిన మహిళా దినోత్సవ వేడుకల్లో మహిళలు భారీ ఎత్తున పాల్గొన్నారు. నేతాజీ నగర్‌లోని గుల్మోహర్ పార్క్‌లో నిర్వహించిన మహిళా దినోత్సవ వేడుకలకు కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు పల్లపు సురేందర్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని పలు క్రీడా కార్యక్రమాలు నిర్వహించగా, మహిళలు ఎంతో ఉత్సాహంగా పాల్గొని తమ ప్రతిభను ప్రదర్శించారు. కార్యక్రమంలో విజేతలుగా నిలిచిన మహిళలకు పల్లపు సురేందర్, రాజు నాయక్ చేతుల మీదుగా బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా పల్లపు సురేందర్ మాట్లాడుతూ మహిళలు ప్రతి రంగంలో ముందుకు సాగుతూ సమాజ అభివృద్ధికి కీలక పాత్ర పోషిస్తున్నారని పేర్కొన్నారు. మహిళలకు సమాన హక్కులు, అవకాశాలు కల్పించాల్సిన అవసరం ఉందని ఆయన తెలిపారు. మహిళల అభివృద్ధి కోసం ఇటువంటి కార్యక్రమాలు నిర్వహించడం ఆనందంగా ఉందన్నారు. నల్లగండ్ల డివిజన్ మహిళల సంక్షేమానికి తన వంతు కృషి చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో నల్లగండ్ల డివిజన్ స్థానిక నాయకులు, కార్యకర్తలు, మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## 'స్వయం' బ్రాండ్ ఉత్పత్తులకు
# నేనే బ్రాండ్ అంబాసిడర్

ఈ కబురు, అమరావతి :
ఈ ఏడాదిలో మరో 5 లక్షల మంది మహిళలను పారిశ్రామికవేత్తలుగా తయారుచేయడమే లక్ష్యమని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు. నిరుడు చెప్పినట్టే ఏడాదిలో లక్ష మంది మహిళలను పారిశ్రామికవేత్తలు చేశామని, వచ్చే ఏడాదికి దేశంలో 6 లక్షల మంది మహిళలు పారిశ్రామికవేత్తలుగా ఉన్న రాష్ట్రం ఏపీనే అవుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ప్రతీ ఇంటి నుంచి ఒక ఎంఎస్ఎంఈ ఉండాలని, అందులో 50 శాతం మహిళలే ఉండాలన్నది తన ఆకాంక్ష అని సీఎం అన్నారు. అమరావతిలోని పరేడ్ గ్రౌండ్‌లో ఆదివారం రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించిన అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకల్లో ముఖ్యమంత్రి చంద్రబాబు పాల్గొన్నారు. ముందుగా విద్యార్థినులతో కలిసి ముఖ్యమంత్రి ర్యాంప్ వాక్ చేస్తూ మహిళలకు అభివాదం చేశారు. అనంతరం స్వయం సహాయ సంఘాలు తయారు చేసిన ఉత్పత్తుల విక్రయాలకు సంబంధించి 'స్వయం ఏపీ' లోగోను ఆవిష్కరించారు. ఐదుగురు ఉత్తమ ఎంట్రపెన్యూర్‌లకు వేదికపై సన్మానం చేసి అభినందించారు. 6,81,506 మంది మహిళలకు వివిధ విభాగాల నుంచి సబ్సిడీతో ఇచ్చే రూ.10,100 కోట్ల రుణాల మెగా చెక్కును అందించారు. అనంతరం కార్యక్రమాన్ని ఉద్దేశించి ముఖ్యమంత్రి ప్రసంగించారు.

--మహిళలే నిజమైన ఫైనాన్స్ మినిస్టర్లు

'తెలుగింటి ఆడపడుచులకు, దేశంలోని ప్రతీ మహిళకు మహిళా దినోత్సవ శుభాకాంక్షలు తెలియచేస్తున్నా. కష్టానికి, ప్రేమకు, త్యాగానికి ప్రతిరూపం మహిళలు. స్త్రీలను ఆరాధించి, పూజించిన చోట సంపదకు లోటు ఉండదు. ముఖ్యమంత్రిగానే కాదు.. వ్యక్తిగతం గానూ ఆడబిడ్డలనూ అభిమానిస్తా. 1911 నుంచి అంతర్జాతీయ మహిళా దినోత్సవం జరుపుకుంటున్నాం. ఈసారి హక్కులు, న్యాయం, చర్యలు అనే కొత్త థీమ్‌ని ప్రవేశపెట్టారు. మహిళా హక్కులు కాపాడటం, చట్టపరంగా న్యాయం చేయడం, వారి ఉన్నతికి చర్యలు తీసుకోవడం ఉన్నత స్థానాలకు తీసుకెళ్లేలా థీమ్‌ను తీసుకున్నాం. మంత్రివర్గంలో ముగ్గురు మహిళా మంత్రులు సమర్థవంతంగా పని చేస్తున్నారు. దేశ అధ్యక్షురాలిగా ఒక గిరిజన మహిళ ఉన్నారు. దేశ ఆర్థికమంత్రి కూడా మన ఆడ పడుచే. ఏటా బడ్జెట్‌ను సమర్థవంతంగా ప్రవేశపెడుతున్నారు. బడ్జెట్ రూపకల్పనకు మారుపేరు మహిళలు. కుటుంబానికి వచ్చిన ఆదాయాన్ని సమర్థవంతంగా వినియోగించే మన మహిళలే నిజమైన ఫైనాన్స్ మినిస్టర్లు. త్వరలో ఏపీ హైకోర్టుకు చీఫ్ జస్టిస్ కూడా మహిళే రాబోతున్నారు' అని సీఎం చంద్రబాబు తెలిపారు.

--మహిళా సాధికారతకు బాటలు వేసింది ఎన్టీఆర్

'కూటమి ప్రభుత్వం మహిళల అభ్యున్నతికే పనిచేస్తోంది. 20192024 మధ్య రాష్ట్రంలో విధ్వంసం జరిగి తీవ్రంగా నష్టపోయాం. పేదలకు న్యాయం చేయాలి, డ్వాక్రా, మెప్మా సంఘాలకు పూర్వ వైభవం తేవాలని కూటమిగా ఏర్పడ్డాం. మహిళలకు శక్తి సామర్థ్యాలను ఇచ్చిన పార్టీ తెలుగుదేశం. మహిళల పేరుపైన మీద ఇంటి స్థలాలు, రుణాలు, సంక్షేమ పథకాలను ఇస్తున్నాం. మొదటగా ఆడబిడ్డలకు న్యాయం చేసింది ఎన్టీఆరే. పురుషులతో సమానంగా మహిళలకు ఆస్తిలో సమాన హక్కు ఇచ్చారు. విద్యలో మహిళలను ప్రోత్సహించేందుకు పద్మావతీ యూనివర్సిటీని ఏర్పాటు చేశారు. స్థానిక సంస్థల్లో మహిళలకు 8 శాతం రిజర్వేషన్లు కల్పించారు. దానికి కొనసాగింపుగా కళాశాలల్లో, ఉద్యోగాల్లో 33 శాతం రిజర్వేషన్లు అమలు చేశాను. చట్టసభల్లోనూ 33 శాతం రిజర్వేషన్లు రానున్నాయి. ఎమ్మెల్యేలు కావాలనుకునే మహిళలు దీనికి సిద్ధంగా ఉండాలి. మహిళకు అన్ని రంగాల్లో అవకాశాలు కల్పించాలనే ఉద్దేశంతో ఉద్యోగాలు, కాలేజీల్లో రిజర్వేషన్లు పెడితే కొందరు వ్యతిరేకించారు. అయినా ఆడబిడ్డలు పైకి రావాలనే ఉద్దేశంతో ముందుకెళ్లాను. మగవాళ్ల కంటే ఎక్కువ ఆదాయం మహిళలు ఆర్జిస్తున్నారు. 1997లో ఆడబిడ్డ పుడితే భారమనే రోజుల్లోనే ఆలోచించి ఆడపిల్లల సంరక్షణ పథకం తెచ్చి రూ.5 వేలు డిపాజిట్ చేశాం. స్కూల్‌కు వెళ్లే 8, 9, 10 తరగతి విద్యార్థినులకు సైకిళ్లు ఇచ్చి ప్రోత్సహించాను' అని ముఖ్యమంత్రి గుర్తు చేశారు.

--స్త్రీశక్తి ద్వారా ఇప్పటికి 50 కోట్ల బస్సు ప్రయాణాలు

డ్వాక్రా, మెప్మా సంఘాలు దేశానికి ఆదర్శంగా నిలిచాయి.. గృహ హింసపై డ్వాక్రా సంఘాల్లో చర్చ జరగాలి. ప్రతీ ఇంట్లో ఆడబిడ్డకు అన్యాయం జరగకుండా చూడాల్సిన బాధ్యత స్వయం సహాయక సంఘాలది. ఎంతమంది బిడ్డలున్నా తల్లికి వందనం కింద రూ.15 వేలు ఇచ్చి మహిళల్ని గౌరవించాం. స్త్రీశక్తి పథకంతో బస్సులో ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించాం. గతేడాది ఆగస్టు 15న ప్రారంభించిన ఈ పథకం కింద ఇప్పటికి 50 కోట్ల ఉచిత ప్రయాణాలు మహిళలు చేశారు. దీపం పథకంతో మహిళలకు గ్యాస్ కనెక్షన్లు ఉచితంగా ఇచ్చాం. ఇప్పుడు 3 సిలిండర్లు ఏడాదికి ఉచితంగా ఇస్తున్నాం. అమెరికాఇరాన్ యుద్ధం మన మార్కెట్లను ప్రభావితం చేస్తోంది. పెట్రోల్, గ్యాస్ ధరలు పెరుగుతున్నాయి. ఓపెన్ మార్కెట్లో సిలిండర్ ధర పెరిగినా ఆడబిడ్డలకు ఉచితంగానే అందిస్తాం. గత ఏడాది మహిళా దినోత్సవం సందర్భంగా లక్ష మంది మహిళలను పారిశ్రామికవేత్తలను చేస్తామని చెప్పాం. ఇప్పటికి 1,12,686 మంది మహిళలు ఎంఎస్ఎంఈలు ఏర్పాటు చేశారు. డ్వాక్రా సభ్యులు, మహిళలు తీసుకున్న రుణాలు సకాలంలో చెల్లిస్తారని, దీనివల్ల బ్యాంకులు విరివిగా రుణాలు ఇస్తున్నాయి' అని ముఖ్యమంత్రి తెలిపారు.

--స్వయం బ్రాండ్లకు నేనే బ్రాండ్ అంబాసిడర్ అవుతా



'ప్రతీ ఇంటికి ఒక పారిశ్రామికవేత్తను తయారు చేయాలని సంకల్పించాం. మన ఆడబిడ్డలు ఏదైనా మంచి పని కోసం సంకల్పం తీసుకున్నారంటే అది సాధించే వరకు వదలరు. 'స్వయం ఏపీ బ్రాండ్'ను ప్రారంభించడం సంతోషంగా ఉంది. డ్వాక్రా సభ్యులు తయారు చేసే ఉత్పత్తులను మహిళలే వినియోగించుకోవాలి. అదే జరిగితే రాష్ట్రవ్యాప్తంగా కోటి మంది ఉన్న డ్వాక్రా సభ్యుల ఇళ్లలోని 3.30 కోట్ల మంది వినియోగించుకుంటారు. మన బ్రాండ్లు బాగుంటే ప్రపంచమే మన దగ్గరకు వస్తుంది. స్వయం బ్రాండ్‌ను గ్లోబల్ బ్రాండ్‌గా మార్చే బాధ్యత నేను తీసుకుంటాను. దేనికైనా బ్రాండ్, నాణ్యత చాలా ముఖ్యం. మంచి బ్రాండ్ ఉంటే తీసుకుంటారు. కావాల్సిన యంత్ర పరికరాలు ఇప్పించే బాధ్యత నాది. సొంత ఊర్లోనే కూర్చుని ఉత్పత్తులు తయారు చేసే బాధ్యత మహిళలది. మీ ఉత్పత్తులను మార్కెటింగ్ కల్పించే బాధ్యత తీసుకుంటాము. డ్వాక్రా మహిళల స్వయం బ్రాండ్లను ప్రమోట్ చేయడానికి నేను బ్రాండ్ అంబాసిడర్‌గా ఉంటాను. మహిళా పారిశ్రామికవేత్తలుగా నా భార్య, కోడలు సమర్థవంతంగా రాణిస్తున్నారు. హెరిటేజ్ నుంచి వస్తున్న సంపాదనతో నేను, లోకేష్ గౌరవంగా రాజకీయాలు చేస్తున్నాం. వారిలాగే ప్రతీ ఇంట్లోని ఆడబిడ్డ పారిశ్రామిక వేత్తలుగా ఉండాలనేది నా ఆకాంక్ష. వెలుగు ప్రాజెక్టు కిందకు సెర్ప్, మెప్మాలను తీసుకొస్తాం' అని సీఎం ప్రకటించారు.

## తెలంగాణ పోలీస్ రిట్రీట్2026 ను
# ప్రారంభించిన మంత్రి డి .శ్రీధర్ బాబు



ఈ రెండు రోజుల రిట్రీట్ ద్వారా సమీక్షించుకుని, తెలంగాణ పోలీస్ శాఖకు మరింత ఖ్యాతి తీసుకురావాలని ఆకాంక్షించారు. డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ బి. శివధర్ రెడ్డి మాట్లాడుతూ... రిట్రీట్ లో జరిగే చర్చలు వాస్తవికతకు దగ్గరగా ఉండాలని సూచించారు. ప్రభుత్వ ఆలోచనలకు అనుగుణంగా పోలీసు శాఖలో చేపట్టాల్సిన సంస్కరణలపై మేధోమథనం జరగాలన్నారు. ఓపెన్ ఫోరంలో అధికారులు తమ అభిప్రాయాలను నిర్భయంగా వెల్లడించి, వాటిని క్షేత్రస్థాయిలో అమలు చేయాలని కోరారు.మాజీ డీజీపీ మహేందర్ రెడ్డి మాట్లాడుతూ.. జనాభా పెరుగుతున్న నిష్పత్తిలో సిబ్బంది నియామకం ఎప్పుడూ సాధ్యపడదని, అందుకే అందుబాటులో ఉన్న వనరులతోనే పనితీరును ఎలా మెరుగుపరుచుకోవాలో యోచించాలన్నారు. ప్రస్తుతం దేశంలోనే తెలంగాణ పోలీస్ అగ్రస్థానంలో ఉందని, ఆ స్థానాన్ని సుస్థిరం చేసుకోవాలని పిలుపునిచ్చారు. మరో మాజీ డీజీపీ హెచ్. జె. దొర మాట్లాడుతూ.. అధికారులు తమ అనుభవాలను రంగరించి శాంతిభద్రతల పరిరక్షణలో మెరుగైన ఫలితాలు సాధించాలని సూచించారు.అకాడమీ డైరెక్టర్ అభిలాష బిస్త్ మాట్లాడుతూ.. రెండు రోజుల పాటు జరిగే ఈ కార్యక్రమంలో అధికారులను ఆరు గ్రూపులుగా విభజించినట్లు తెలిపారు. వివిధ అంశాలపై లోతైన చర్చలు జరిపి నివేదికలు రూపొందిస్తామని వివరించారు. ఈ కార్యక్రమంలో టీజీసీఎస్‌బీ డైరెక్టర్ శిఖా గోయల్, శాంతి భద్రతల అదనపు డిజిపి మహేష్ ఎం భగవత్, గ్రేహౌండ్స్ అడిషనల్ డీజీపీ అనిల్ కుమార్, 'ఈగల్' డైరెక్టర్ సందీప్ శాండిల్య, సైబరాబాద్ సిపి డాక్టర్ ఎం. రమేష్ సహా పలువురు పోలీస్ అధికారులు పాల్గొన్నారు.

# కొత్త హంగులతో తెలంగాణ శాసన మండలి భవనం ప్రారంభం

**ఈ కబురు, హైదరాబాద్ ;**



తెలంగాణ శాసనసభ ప్రాంగణంలోని చారిత్రక పాత అసెంబ్లీ భవనం ఇకపై శాసన మండలి (లెజిస్లేటివ్ కౌన్సిల్)గా సేవలు అందించనుంది. అత్యాధునిక హంగులతో ఆధునీకరించిన ఈ భవనాన్ని ఆదివారం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి లాంఛనంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మండలి ఛైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి, అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్, మంత్రులు, సీనియర్ అధికారులు పాల్గొన్నారు. రాబోయే బడ్జెట్ సమావేశాలు ఈ కొత్త భవనంలోనే జరగనున్నాయి. నిజాం కాలం నాటి ఇండోసార్సెనిక్ వాస్తుశైలిలో నిర్మితమైన ఈ భవనంలో గతంలో హైదరాబాద్ రాష్ట్ర అసెంబ్లీ, ఆ తర్వాత ఉమ్మడి ఏపీ అసెంబ్లీ సమావేశాలు జరిగేవి. 2014 రాష్ట్ర విభజన తర్వాత దీనిని ఏపీ అసెంబ్లీకి కేటాయించారు. అయితే ఏపీ అసెంబ్లీ అమరావతికి తరలివెళ్లడంతో ఈ భవనం నిరుపయోగంగా మారి శిథిలావస్థకు చేరింది. 2023లో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత, అసెంబ్లీ మరియు కౌన్సిల్ రెండూ ఒకే ప్రాంగణంలో ఉండాలన్న సీఎం రేవంత్ రెడ్డి ఆలోచన మేరకు ఈ హెరిటేజ్ భవనాన్ని పునరుద్ధరించాలని నిర్ణయించారు. ఆగాఖాన్ ట్రస్ట్ ఫర్ కల్చర్ (ఏకేటీసీ) సహకారంతో రూ.30 కోట్లతో 18 నెలల పాటు ఈ పనులు సాగాయి. ఇందులో అధునాతన డ్రైనేజీ, ఎలక్ట్రికల్ సిస్టమ్స్, ఫ్లోరింగ్ పనులు చేపట్టారు. సీఎం, ఛైర్మన్, వైస్ ఛైర్మన్ కోసం ప్రత్యేక ఛాంబర్లు, మీడియా హాల్‌ను ఏర్పాటు చేశారు. ఈ భవనం పార్లమెంట్ తరహాలో ఎంతో అద్భుతంగా ఉందని, సభ్యులకు అన్ని సౌకర్యాలు కల్పించామని మండలి ఛైర్మన్ సుఖేందర్ రెడ్డి పేర్కొన్నారు. 2018 నుంచి ఇప్పటివరకు జూబ్లీహాల్‌లో మండలి సమావేశాలు జరుగుతుండగా, ఇకపై ఆ హాల్‌ను ప్రభుత్వ అధికారిక కార్యక్రమాలకు వినియోగించనున్నారు. అలాగే ఉభయ సభల సంయుక్త సమావేశాల కోసం కొత్త సెంట్రల్ హాల్ నిర్మించే యోచనలో కూడా ప్రభుత్వం ఉంది.

## 'గివ్ హర్ స్పేస్'
# తెలంగాణ జాగృతి నినాదం: కవిత




ఈ కబురు, హైదరాబాద్: మహిళా దినోత్సవం రోజే కాదు.. ప్రతిరోజు మహిళలను గౌరవించాలని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కవిత అన్నారు. తెలంగాణ జాగృతి కార్యాలయంలో నిర్వహించిన మహిళా దినోత్సవ వేడుకల్లో ఆమె పాల్గొన్నారు. 'గివ్ హర్ స్పేస్' పేరిట పోస్టర్‌ను ఆవిష్కరించారు. 'స్టాండ్ విత్ హర్' కాదు.. 'గివ్ హర్ స్పేస్' జాగృతి నినాదం అని వివరించారు. ''పెద్ద కులం, చిన్న కులం కాదు.. మహిళలంతా ఒక్కటే కులం. ఏ ఇంట్లో పుట్టినా సరే.. వారిపై వివక్షే ఉంటోంది. భర్త, తండ్రి, అన్న అందరూ తక్కువ చేసేవారే. మహిళలు లేకుండా తెలంగాణ ఉద్యమమే లేదు. సామాజిక తెలంగాణ సాధనలోనూ వారి పాత్రే కీలకం. వయసుతో సంబంధం లేకుండా మహిళలంతా రాజకీయాల్లోకి రావాలి. కాంగ్రెస్ వచ్చాక వారిపై నేరాల శాతం పెరిగింది. మహిళలకు 33 శాతం సీట్ల రిజర్వేషన్ సాధనతో జాగృతి చరిత్ర సృష్టించింది'' అని కవిత అన్నారు.

# కాంగ్రెస్ నిర్ణయంతో ఇరాన్‌తో భారత్ సంబంధాలు దెబ్బతిన్నాయి

ఈ కబురు, హైదరాబాద్ ;
2005లో యూపీఏ ప్రభుత్వం ఇంటర్నేషనల్ అటామిక్ ఎనర్జీ ఏజెన్సీలో ఇరాన్‌కు వ్యతిరేకంగా ఓటు వేసిందని, దీనితో 2012లో మనకు ఇరాన్ ఆయిల్ సరఫరా నిలిపివేసింది తెలంగాణ బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్ రావు అన్నారు. యూపీఏ ప్రభుత్వం ఆరోజు తీసుకున్న నిర్ణయం భారత్, ఇరాన్ సంబంధాలను దెబ్బతీసిందని విమర్శించారు. కాంగ్రెస్ పార్టీ దేశానికి అనుకూలంగా మాట్లాడకపోయినా పర్వాలేదు కానీ ప్రజల్లో భయాందోళనలు కలిగించే తప్పుడు ప్రచారం చేయవద్దని హితవు పలికారు. గతంలో ఇరాన్‌కు వ్యతిరేకంగా వ్యవహరించిన కాంగ్రెస్, ఇప్పుడు ఇరాన్‌కు అనుకూలంగా మాట్లాడుతున్నట్లు నటిస్తూ, భారతదేశంలో చమురు కొరత ఉందని తప్పుడు ప్రచారం చేస్తోందని మండిపడ్డారు. యూపీఏ హయాంలో కేవలం 16 దేశాల నుంచి మాత్రమే చమురు దిగుమతి చేసుకునే వారమని, నరేంద్ర మోదీ ప్రభుత్వం వచ్చాక ఆ సంఖ్య 40 దేశాలకు పెరిగిందని అన్నారు. గ్యాస్ సిలిండర్ ధరలపై ఎటువంటి ప్రభావం ఉండదని ఆయన హామీ ఇచ్చారు. దేశంలో తగినంత ఇంధనం, గ్యాస్ స్టాక్ ఉందని రామచందర్ రావు తెలిపారు. ప్రస్తుతం ఇరాన్, ఇజ్రాయెల్ యుద్ధం నేపథ్యంలో కాంగ్రెస్ పార్టీ ప్రజల్లో ఆందోళన కలిగించే అబద్ధపు ప్రచారం చేస్తోందని మండిపడ్డారు. చైనాతో రహస్య ఒప్పందాలు చేసింది కాంగ్రెస్ పార్టీయే అన్నారు. తెలంగాణలో ఖజానా ఖాళీ అయిందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నిత్యం కథలు చెబుతున్నారని, కానీ అదే ప్రజల ధనంతో ఇతర రాష్ట్రాల్లో ఎన్నికల ప్రచారం ఎలా చేస్తున్నారని ప్రశ్నించారు. కేరళలో జరుగుతున్న ఎన్నికల ప్రచారం కోసం కోట్లాది రూపాయల ప్రజాధనాన్ని వృధా చేస్తున్నారని ఆరోపించారు. వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ ఏ పార్టీతోనూ పొత్తు పెట్టుకోదని తెలిపారు. తెలంగాణలో ప్రజలు బీజేపీ వైపు చూస్తున్నారని అన్నారు.

### ఇపాన్‌కార్డు డౌన్‌లోడ్ పేరుతో మెయిల్సా?

# తస్మాత్ జాగ్రత్త!




ఇపాన్‌కార్డ్ (ePAN Card) డౌన్‌లోడ్ చేసుకోవాలంటూ మెయిల్స్ వచ్చాయా? అయితే అది సైబర్ నేరగాళ్ల పన్నాగం అని గ్రహించండి. ఇలాంటి మెయిల్స్‌తో అప్రమత్తంగా ఉండాలని పీఐబీ ఫ్యాక్ట్‌చెక్ విభాగం ఎక్స్ వేదికగా పౌరులకు సూచించింది. ఆర్థిక వివరాలు, సున్నిత సమాచారం తస్కరించేందుకు సైబర్ నేరగాళ్లు ఈ తరహా మెయిల్స్, లింకులు పంపిస్తుంటారని హెచ్చరించింది. కాబట్టి తప్పుడు సమాచారాలను నమ్మొద్దని కోరింది. ఏదైనా సందేహం ఉంటే, అధికారిక వెబ్‌సైట్‌ను ఆశ్రయించాలని సూచించింది.

# గ్యాస్ సిలిండర్ బుకింగ్.. కొత్త రూల్స్!



ప్రపంచ పరిస్థితులను దృష్టిలో పెట్టుకుని దేశీయ గ్యాస్ సిలిండర్ల బుకింగ్‌కు సంబంధించిన నిబంధనల్లో మార్పులు చేశారు. ఇప్పటివరకు ఒక సిలిండర్ డెలివరీ తర్వాత మరొక సిలిండర్ బుక్ చేయడానికి 15 రోజుల గడువు ఉండేది. ఇకపై ఈ వ్యవధిని 21 రోజులకు పెంచారు. అంటే ఒక సిలిండర్ డెలివరీ అయిన తర్వాత మరో సిలిండర్ డెలివరీకి కనీసం 21 రోజుల విరామం ఉండాల్సి ఉంటుంది.

ఈ కొత్త నిబంధన అమలుకు గ్యాస్ ఏజెన్సీల సాఫ్ట్‌వేర్‌ను వెంటనే అప్‌డేట్ చేశారు. అయితే బుకింగ్ విధానం మాత్రం యథాతథంగా కొనసాగుతుంది. ఇది ప్రస్తుతానికి తాత్కాలికమే అయినా భవిష్యత్తులోనూ 21 రోజుల గడువు పూర్తైన తర్వాత మాత్రమే బుకింగ్ చేసుకునే విధానాన్ని అమలు చేయాలనే విషయాన్ని కేంద్ర మంత్రిత్వ శాఖ పరిశీలిస్తోంది.

ఏడాదికి 15 సిలిండర్ల కొనుగోలుకు అనుమతి

దేశీయ గ్యాస్ సిలిండర్ల వినియోగంపై చమురు సంస్థలు ఇప్పటికే కొన్ని నిబంధనలు అమలు చేస్తున్నాయి. వాటి ప్రకారం ప్రతి వినియోగదారు సంవత్సరానికి గరిష్టంగా 12 సబ్సిడీ సిలిండర్లు మాత్రమే పొందగలరు. అదనంగా మూడు సబ్సిడీ రహిత సిలిండర్లను కొనుగోలు చేసుకునే అవకాశం ఉంది. ఈ విధంగా ఏడాదిలో ఏప్రిల్ 1 నుంచి మార్చి 31 వరకు ఒక్క గ్యాస్ కనెక్షన్‌పై మొత్తం 15 సిలిండర్లు కొనుగోలు చేయడానికి అనుమతి ఉంటుంది.

24 గంటల్లో సిలిండర్ డెలివరీ

వినియోగదారుల సౌకర్యాన్ని దృష్టిలో ఉంచుకుని బుకింగ్ చేసిన తర్వాత 24 గంటలలోపు సిలిండర్ డెలివరీ చేయాలని చమురు కంపెనీలు ఏజెన్సీలకు సూచించాయి. ఈ నిబంధన వల్ల వినియోగదారులకు మరింత సౌలభ్యం కలగనుంది.

21 రోజుల తర్వాతే రెండో సిలిండర్ డెలివరీ

కొత్త నిబంధన ప్రకారం మొదటి సిలిండర్ అందుకున్న 21 రోజుల తర్వాత మాత్రమే రెండో సిలిండర్ డెలివరీ ఇవ్వబడుతుంది. దీనిని ఏజెన్సీల సాఫ్ట్‌వేర్‌లో లాక్ చేశారు. అయితే సిలిండర్ల కొరత ఏమీ లేదని అధికారులు స్పష్టం చేశారు. వినియోగదారులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని లిపారు. ఇక సరఫరాలో ఎలాంటి అంతరాయం లేకుండా ఉండేందుకు ఈ వారం బాట్లింగ్ ప్లాంట్లు ఆదివారాల్లో కూడా పనిచేయనున్నట్లు సమాచారం.

గ్యాస్ సిలిండర్ ధరలు ఇలా..

పశ్చిమ ఆసియా ఉద్రిక్తతల కారణంగా అంతర్జాతీయ ఇంధన ధరలు పెరగడంతో భారతదేశంలో డొమెస్టిక్ ఎల్‌పీజీ (14.2 కేజీలు) సిలిండర్ ధరలు మార్చి 7 నుంచి రూ.60 పెరిగాయి. ఈ పెంపు ఉజ్వల యోజన లబ్ధిదారులకు వర్తించదు. వారికి రూ.300 సబ్సిడీ కొనసాగుతుంది.

దేశంలోని ప్రధాన నగరాల్లో ప్రస్తుతం డొమెస్టిక్ ఎల్‌పీజీ గ్యాస్ సిలిండర్ల ధరలు ఇలా ఉన్నాయి.. ఢిల్లీలో రూ.913, ముంబైలో రూ.912.50, కోల్‌కతాలో రూ.939, చెన్నైలో రూ.928.50, బెంగళూరులో రూ.915.50, హైదరాబాద్‌లో రూ.965లుగా ఉన్నాయి.

# షేర్ల లిస్టింగ్‌కు గిఫ్ట్ సిటీకి వెళ్దామా!




మన దేశంలో కంపెనీల షేర్ల లిస్టింగ్ ప్రక్రియ ఇప్పటివరకు బీఎస్ఈ, ఎన్ఎస్ఈల వరకే పరిమితమవ్వడాన్ని మనం చూశాం. ఇప్పుడు గిఫ్ట్ సిటీ మార్గం ద్వారా కూడా కంపెనీలు తమ షేర్లను లిస్ట్ చేసుకోవచ్చు. ఇలా నమోదుకానున్న మొదటి సంస్థగా విద్యా సేవల ప్లాట్‌ఫామ్ ఎక్స్ఈడీ నిలవబోతోంది. లిస్టింగ్ ప్రక్రియకు సంబంధించిన కసరత్తును ఇప్పటికే ప్రారంభించినట్లు తెలుస్తోంది. ఇది విజయవంతమైతే.. మరిన్ని చిన్న కంపెనీలు సెకండరీ మార్కెట్లోకి అడుగుపెట్టేందుకు ఎస్ఎంఈ ఎక్స్ఛేంజీలకు బదులు గిఫ్ట్ సిటీ మార్గాన్ని ఎంచుకునే అవకాశం ఉందని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. గిఫ్ట్‌సిటీ వద్ద ఎక్స్ఛేంజీలను ఇంటర్నేషనల్ ఫైనాన్షియల్ సర్వీసెస్ సెంటర్స్ అథారిటీ (ఐఎఫ్ఎస్‌సీఏ) పర్యవేక్షిస్తుంది. ఇది సెబీ లాంటిది అన్నమాట. ఇప్పుడు ఎక్స్ఈడీ లిస్టింగ్ రూపంలో ఐఎఫ్ఎస్‌సీఏ తొలి పరీక్షను ఎదుర్కోబోతోంది.

**అనుమతులు వేగంగా..**

గిఫ్ట్ సిటీలో నమోదుకు సంబంధించి విధివిధానాల రూపకల్పన ఇంకా పూర్తి స్థాయిలో కానందున.. నియంత్రణ సంస్థలు కూడా సులువుగానే అనుమతులు ఇచ్చే అవకాశం ఉందని విశ్లేషకులు చెబుతున్నారు. గిఫ్ట్ సిటీలో లిస్టింగ్‌ను ప్రభుత్వం కూడా ప్రోత్సహిస్తున్నందున.. అనుమతుల ప్రక్రియ వేగంగా, సులభంగా ఉంటుందని మోనార్క్ నెట్‌వర్త్ కేపిటల్‌కు చెందిన సాహిల్ కింఖాబ్‌వాలా అంటున్నారు. అయితే లిక్విడిటీ పరిస్థితులు (క్రయ విక్రయాలప్పుడు బయ్యర్, సెల్లర్ లభ్యత) ఇప్పుడిప్పుడే మెరుగవుతున్నందున.. ఈ విషయంలో మదుపర్లు కొంత అప్రమత్తంగా ఉండటం మంచిదని సూచిస్తున్నారు. 2012లో ఎస్ఎంఈ ఎక్స్ఛేంజీలు ప్రారంభమైనప్పుడు కూడా ఇవే సమస్యలు ఎదురయ్యాయని.. కాలక్రమేణా వీటిల్లో లిక్విడిటీ పెరుగుతూ వచ్చిందని కింఖాబ్‌వాలా గుర్తు చేశారు.

**విదేశీ పెట్టుబడుల ఆకర్షణ..**

గిఫ్ట్ సిటీ ఇష్యూల ద్వారా విదేశీ మదుపర్లను కంపెనీలు ఆకర్షించే అవకాశం ఉంటుంది. సెబీ నియంత్రణలో జరిగే ఐపీఓల్లో ఎక్కువగా భారత మ్యూచువల్ ఫండ్‌లు, హెచ్ఎన్ఐలు, చిన్న మదుపర్లు పాల్గొంటుండగా.. గిఫ్ట్ సిటీ లిస్టింగ్‌లు విదేశీ ఫండ్‌లకు మరింత ఆకర్షణీయంగా ఉండనున్నాయి. సెక్యూరిటీస్ లావాదేవీల పన్ను (ఎస్‌టీటీ), స్టాంప్ డ్యూటీ లేకపోవడం, మూలధన లాభాలపై పన్ను మినహాయింపు ఉండటం కూడా సానుకూలాంశాలే.

**ఆ కంపెనీలే ఎక్కువగా రావొచ్చు..**

లాభాల్లో నడుస్తున్న కంపెనీలతో పోలిస్తే ప్రారంభ స్థాయి లేదా నష్టాల్లోని కంపెనీలే గిఫ్ట్ సిటీ లిస్టింగ్ మార్గాన్ని ఎంచుకునే అవకాశం ఉందని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

**వ్యత్యాసాలేమిటి?**

సెబీ నియంత్రణలో జరిగే ఐపీఓ ప్రక్రియలో కంపెనీలకు వెల్లడి నిబంధనలు కొంచెం కఠినంగానే ఉంటాయి. ప్రమోటరు, ప్రమోటరు గ్రూపు సమాచారాన్ని, మూలనిధి వివరాలను విడమర్చి వెల్లడించడం తప్పనిసరి. మరోవైపు ఐఎఫ్ఎస్‌సీఏ విషయానికొస్తే.. కంపెనీలు తమ వివరాలను విపులంగా వెల్లడించాల్సిన అవసరం లేదు. అంశాలవారీగా పైపైన తెలియజేస్తే సరిపోతుంది. కార్పొరేట్ పాలనా నిబంధనల పాటింపునకు సంబంధించి ఐపీఓ పత్రాల సమర్పణ సమయంలో బోర్డు వివరాలను పూర్తి స్థాయిలో కంపెనీలు సెబీకి తెలియజేయాల్సి ఉంటుంది. మరోవైపు లిస్టింగ్ కంపెనీలకు కార్పొరేట్ పాలనా నిబంధనల రూపకల్పనను ఇప్పటివరకైతే ఐఎఫ్ఎస్‌సీఏ రూపొందించలేదు. లాక్‌ఇన్ పీరియడ్ విషయంలోనూ సెబీ నిబంధనలతో గిఫ్ట్ సిటీ నిబంధనలు సరళంగా ఉన్నాయి. సెబీ నిబంధనల ప్రకారం.. 20 శాతం ప్రమోటరు వాటాకు మూడేళ్లు లాక్‌ఇన్ పీరియడ్ వర్తిస్తుంది. ఐఎఫ్ఎస్‌సీఏ నిబంధనల్లో ప్రమోటర్ల వాటాకు ఆరు నెలలే లాక్‌ఇన్ పీరియడ్ ఉంటుంది.

# వార్ ఎఫెక్ట్: 4 రోజుల్లో రూ.21 వేల కోట్లు FPIలు బయటకు



అమెరికాఇజ్రాయెల్, ఇరాన్ యుద్ధంతో పశ్చిమాసియాలో ఉద్రిక్త పరిస్థితులు కొనసాగుతున్నాయి. ఈ దాడులు దేశీయ ఈక్విటీ మార్కెట్లను ప్రభావితం చేస్తున్నాయి. విదేశీ పోర్టుఫోలియో మదుపర్లు (FPI) గడిచిన నాలుగు ట్రేడింగ్ సెషన్లలో రూ.21 వేల కోట్ల పెట్టుబడులను ఉపసంహరించుకున్నారు. ఫిబ్రవరిలో రూ.22,615 కోట్ల విలువైన పెట్టుబడులను విక్రయించారు. గత 17 నెలల్లో ఇదే అత్యధికం కావడం గమనార్హం. మార్చి 2 నుంచి 6వ తేదీల మధ్య రూ.21 వేల కోట్ల విలువైన ఈక్విటీ షేర్లను విక్రయించారు. పశ్చిమాసియా ఉద్రిక్తతల ప్రభావం మార్కెట్‌పై పడిందని నిపుణులు చెబుతున్నారు. ముడి చమురు, గ్యాస్ రవాణాకు కేంద్ర బిందువైన హర్మ్యూజ్ జలసంధి చుట్టూ నెలకొన్న అడ్డంకులు, బ్రెంట్ ముడి చమురు ధర 90 డాలర్లకు చేరడం ప్రపంచ మార్కెట్ సెంట్‌మెంట్‌ను దెబ్బతీసిందని సీనియర్ నిపుణుడు వకార్ జావేద్ ఖాన్ తెలిపారు. రూపాయి విలువ పతనమవడం అమెరికా ట్రెజరీ బాండ్లపై రాబడులు పెరగడం పెట్టుబడులు తరలిపోవడానికి మరో కారణమన్నారు. దీనికితోడు ఐటీ, వినియోగ రంగాలపై ఒత్తిళ్ల కారణంగా క్యూ4 త్రైమాసిక ఫలితాలపై మిశ్రమ అంచనాలు నెలకొన్నాయన్నారు. బ్రెంట్ క్రూడ్ ధర పెరగడం భారతీయ ఆర్థిక వ్యవస్థకు ప్రతికూలంగా మారిందని మరో అనలిస్ట్ విజయ్ కుమార్ తెలిపారు. ఈ పరిస్థితుల్లో విదేశీ మదుపర్లు సురక్షితమైన పెట్టుబడులు పెట్టాలని భావిస్తున్నారని తెలిపారు. ఓ వైపు ఎఫ్‌పీఐల అమ్మకాలు కొనసాగుతున్నా.. డొమెస్టిక్ ఇన్వెస్టర్లు మాత్రం ఈక్విటీ మార్కెట్‌కు దన్నుగా నిలుస్తున్నారు.

# సమ్మర్‌లో ఏసీ షాక్.. ధరలు పెంచేస్తున్న కంపెనీలు




**ఈ వేసవికి ఏసీ కొనాలనుకుంటున్నారా? అయితే మీకో బ్యాడ్ న్యూస్. ముడి పదార్థాల ధరల పెరుగుదల, డాలరుతో పోలిస్తే రూపాయి విలువ పతనం వంటి కారణాలతో ఏసీ తయారీ కంపెనీలు ధరలు పెంపునకు** సిద్ధమవుతున్నాయి. రవాణా ఖర్చులు, కొత్త ఇంధన వినియోగ నిబంధనలు కూడా పెరుగుదలకు కారణమయ్యాయి. దీంతో ఇప్పటికే కొన్ని కంపెనీలు ధరలు పెంచగా.. మరికొన్ని పెంపునకు సిద్ధమవుతున్నాయి. డైకిన్, వోల్టాస్, బ్లూస్టార్, ఎల్‌జీ, హైయర్, మిత్సుబిషి వంటివి ఈ జాబితాలో ఉన్నాయి. ప్రముఖ ఏసీల తయారీ కంపెనీ డైకిన్ తన ఏసీ ధరలను 12 శాతం వరకు పెంచనుంది. మోడల్‌ను బట్టి ఏప్రిల్ నుంచి ఈ పెంపు ఉండబోతోందని డైకిన్ ఇండియా ఛైర్మన్, ఎండీ కన్వల్జీత్ జావా పేర్కొన్నారు. ఏసీల తయారీలో వినియోగించే రాగి వంటి ముడి సరకుల ధరలు పెరగడంతో పాటు, కొత్త ఇంధన నిబంధనల వల్ల ధరలు పెంచాల్సిన పరిస్థితి నెలకొందన్నారు. డాలరుతో పోలిస్తే రూపాయి మారకం విలువ ఆల్‌టైమ్ గరిష్ఠానికి చేరడం, పశ్చిమాసియాలో ఉద్రిక్తత పరిస్థితుల వల్ల సరకు రవాణా ఖర్చులు పెరగడంతో ప్రత్యామ్నాయం లేక ఏసీ ధరలను పెంచాల్సి వస్తోందని తెలిపారు. ప్రతి ఏసీ కంపెనీదీ ఇదే పరిస్థితి అని వివరించారు. ఈ ఏడాది ఏసీల విక్రయాల్లో 15 శాతం వృద్ధి నమోదు కావొచ్చని అంచనా వేశారు. బ్లూస్టార్ ఇది వరకే: మరో ప్రముఖ ఏసీ తయారీ కంపెనీ బ్లూస్టార్ ఫిబ్రవరి మధ్యలోనే ఏసీ ధరలను 8-10 శాతం పెంచేసింది. అయితే పాత ధరల ఇన్వెంటరీ ఇప్పటికీ మార్కెట్లో ఉన్నందువల్ల రేటులో పెద్దగా తేడా ఉండబోదని ఆ కంపెనీ మేనేజింగ్ డైరెక్టర్ బి.త్యాగరాజన్ తెలిపారు. ఏసీల ధరల పెరుగుదల ఊహించి డీలర్లు ముందుగానే స్టాక్ పెట్టుకుని, వాటిని విక్రయిస్తున్నారని చెప్పారు. కొత్త స్టాక్‌పై మాత్రం ధరల ప్రభావం ఉంటుందని పేర్కొన్నారు. టాటా గ్రూప్‌నకు చెందిన వోల్టాస్ సైతం 5-15 శాతం మేర ఏసీల ధరలు పెంచేందుకు సిద్ధమవుతోంది. గడిచిన కొన్ని నెలలుగా రాగి ధరలు పెరగడం, రూపాయి విలువ పతనం అవ్వడం వంటి కారణాలతో రేట్లు పెంచాల్సి వస్తోందని వోల్టాస్ ఎండీ ముకందన్ మేనన్ పేర్కొన్నారు. దీంతో పాటు ఎల్‌జీ సంస్థ 3 స్టార్ ఏసీలపై 7 శాతం, 5 స్టార్ మోడళ్లపై 9-10 శాతం చొప్పున ధరల పెంచుతున్నట్లు వెల్లడించింది. హైయర్ ఇండియా సైతం 5-8 శాతం మధ్య ధరలు పెంచబోతోందని ఆ కంపెనీ ప్రెసిడెంట్ సతీష్ పేర్కొన్నారు. మిత్సుబిషి ఏసీ ధరలు 5 శాతం మేర పెరగనున్నాయని ఆ కంపెనీ పేర్కొంది. 2026పైనే ఆశలు: ఏసీ తయారీ కంపెనీలన్నీ దాదాపు ఈ ఏడాది విక్రయాలపై పెద్దగానే ఆశలు పెట్టుకున్నాయి. గతేడాది వీటి విక్రయాలు మందగించడమే ఇందుకు కారణం. అకాల వర్షా లు, ఇతర అంశాలు వీటి విక్రయాలపై ప్రభావం చూపాయి. 2024లో దేశంలోని అనేక ప్రాంతాల్లో తీవ్రమైన వేడిగాలులు, ఉక్కపోత కారణంగా రికార్డు స్థాయిలో ఏసీల విక్రయాలు నమోదయ్యాయి. మళ్లీ ఆ స్థాయిలో విక్రయాలను ఈ ఏడాది ఉంటాయని మార్కెట్ వర్గాలు ఆశిస్తున్నాయి.

## బెల్లంకొండ వారింట్లో పెళ్లి బాజా.. సందడిగా సాయి శ్రీనివాస్‌కావ్యల రోకా వేడుక



హైదరాబాద్: నటుల వివాహాలతో టాలీవుడ్‌లో సందడి నెలకొంది. విజయ్ దేవరకొండ, అల్లు శిరీష్ బ్యాచిలర్ లైఫ్‌నకు ఇటీవల గుడ్‌బై చెప్పిన సంగతి తెలిసిందే. ఆ జాబితాలోకి బెల్లంకొండ సాయి శ్రీనివాస్ (Bellamkonda Sai Sreenivas) చేరబోతున్నారు. త్వరలోనే ఆయన పెళ్లి చేసుకోబోతున్నారు. సాయి శ్రీనివాస్ రోకా వేడుక (Bellamkonda Sai Sreenivas Roka ceremony) ఆదివారం ఉదయం జరిగింది. ఈ వేడుకకు దర్శకుడు బోయపాటి శ్రీను, హీరోయిన్ సంయుక్త తదితర సినీ ప్రముఖులు హాజరయ్యారు.

శ్రీనివాస్‌కు కాబోయే భార్య పేరు కావ్య. హైదరాబాద్‌కు చెందిన ఆమెకు సినీ రంగంతో సంబంధం లేదు. ప్రముఖ న్యాయవాది కుమార్తె. కొన్నాళ్లుగా వీరిద్దరూ ప్రేమలో ఉన్నట్లు తెలిసింది. నిర్మాత బెల్లంకొండ సురేశ్ తనయుడైన సాయి.. 'అల్లుడు శీను'తో గ్రాండ్‌గా టాలీవుడ్‌లోకి ఎంట్రీ ఇచ్చిన సంగతి తెలిసిందే. 'జయ జానకి నాయక'లాంటి యాక్షన్ చిత్రాలతోపాటు 'రాక్షసుడు', 'కిష్కింధపురి'లాంటి థ్రిల్లర్లతో అలరించారు. ప్రస్తుతం 'హైందవ', 'టైసన్ నాయుడు' సినిమాల్లో నటిస్తున్నారు.



## ఇది నా పూర్వజన్మ సుకృతం: ఎన్టీఆర్

బెంగళూరు కిమ్స్ హాస్పిటల్ స్పెషాలిటీ బ్లాక్‌ను టాలీవుడ్ హీరో ఎన్టీఆర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. "కర్ణాటకకు రావడం అమ్మమ్మ వాళ్ల ఇంటికి వచ్చినట్లుగా ఉంటుంది. 1983 మార్చి 20న తాతగారు ఇక్కడ శంకుస్థాపన చేశారు. మళ్లీ ఇన్నాళ్లకు అదే మార్చిలో నేను రావడం ఆనందంగా ఉంది. ఇది నా పూర్వజన్మ సుకృతం అనుకుంటున్నా. తాత ఆశీస్సులు, మీ అందరి ప్రేమ వల్లే ఇది సాధ్యమైంది" అని పేర్కొన్నారు. వాహనాలను నడిపే సమయాల్లో జాగ్రత్తగా ఉండాలని ఎప్పటిలాగే అభిమానులకు సూచించారు. పాతికేళ్ల తర్వాత ఎన్టీఆర్ ఎలా ఉంటారు? అని ఓ వైద్యుడు అడగ్గా.. 67 అంటూ (అప్పటికి తన వయసు) నవ్వులు పూయించారు. ఒకవేళ డాక్టర్ అయితే.. దేనిలో స్పెషలిస్ట్ అయ్యేవారు? అని అడగ్గా.. పీడియాట్రిషియన్ (చిన్నపిల్లల వైద్యుడు) అని చెప్పారు. తనకు చిన్నారులంటే ఇష్టమన్నారు.

తమ అభిమాన నటుడిని చూసేందుకు ఆస్పత్రి వద్దకు ఫ్యాన్స్ తరలి వచ్చారు. కారులోంచే అభిమానులకు అభివాదం చేశారు ఎన్టీఆర్. కొత్త సినిమా లుక్‌తో కూడిన ఎన్టీఆర్ ఫొటోలు నెట్టింట వైరల్‌గా మారాయి. ప్రశాంత్ నీల్ దర్శకత్వంలో నటిస్తున్న సినిమా కోసమే ఎన్టీఆర్ ఈ లుక్‌లోకి మారారు. చెవికి రింగ్ కూడా పెట్టుకున్నారు. ఈ సినిమాకి 'డ్రాగన్' (Dragon) అనే టైటిల్ అనుకున్నారు. ఇందులో ఎన్టీఆర్ సరసన కన్నడ నటి రుక్మిణీ వసంత్ నటిస్తున్నారు. బాలీవుడ్ నటుడు అనిల్ కపూర్ ఓ కీలక పాత్ర పోషిస్తున్నారు. ఎన్టీఆర్ పుట్టినరోజు సందర్భంగా మే 20న ఆయన ఫస్ట్‌లుక్‌ను విడుదల చేసేందుకు చిత్ర బృందం సన్నాహాలు చేస్తోందని సమాచారం.

# 'భూమా దేవి'

## నా హృదయానికి దగ్గరైన పాత్ర: రష్మిక



నేషనల్ క్రష్ రష్మిక మందన్న తన కెరీర్‌లో మరో అరుదైన గౌరవాన్ని సొంతం చేసుకున్నారు. వ్యక్తిగతంగా, వృత్తిపరంగా ఎంతో ఉత్సాహంగా ఉన్న రష్మిక.. తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా ప్రకటించిన 'గద్దర్ తెలంగాణ చలనచిత్ర అవార్డులు-2025'లో ఉత్తమ నటిగా ఎంపికయ్యారు. శనివారం వెలువడిన ఈ ఫలితాల్లో 'ది గర్ల్‌ఫ్రెండ్' చిత్రంలోని ఆమె అద్భుత నటనకు గాను ఈ అవార్డు దక్కింది. ఈ సందర్భంగా రష్మిక సోషల్ మీడియా వేదికగా తన ఆనందాన్ని పంచుకున్నారు. "గద్దర్ ఫిల్మ్ అవార్డ్స్‌లో ఉత్తమ నటిగా ఎంపిక కావడం చాలా సంతోషంగా ఉంది. నిజంగా కృతజ్ఞురాలిని. ఈ సినిమాలో నేను పోషించిన 'భూమా దేవి' పాత్ర నా మనసుకు ఎంతో దగ్గరైంది" అని ఎక్స్ వేదికగా పేర్కొన్నారు. తనపై నమ్మకం ఉంచిన దర్శకుడు రాహుల్ రవీంద్రన్, గీతా ఆర్ట్స్ సంస్థ, నిర్మాతలకు ఆమె కృతజ్ఞతలు తెలిపారు. అలాగే ఈ గౌరవం దక్కడం పట్ల తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డిలకు రష్మిక ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఇది తనకు ఎంతో విలువైనదని ఆమె వ్యాఖ్యానించారు. మరోవైపు, తెలంగాణ ఫిల్మ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (ఎఫ్ డీసీ) చైర్మన్ దిల్ రాజు విలేకరుల సమావేశంలో ఈ అవార్డుల విజేతలను ప్రకటించారు. 'తండేల్' చిత్రంలో అద్భుత నటనకు గాను అక్కినేని నాగచైతన్య 'ఉత్తమ నటుడు' అవార్డును గెలుచుకున్నారు. ఇదే చిత్రం 'ఉత్తమ జాతీయ సమైక్యత' చిత్రంగా కూడా నిలిచింది. ఇక అనిల్ రావిపూడి దర్శకత్వంలో వచ్చిన 'సంక్రాంతికి వస్తున్నాం' సినిమాకు 'ఉత్తమ వినోదాత్మక చిత్రం' అవార్డు లభించింది. 'ది గర్ల్‌ఫ్రెండ్' విషయానికి వస్తే.. కాలేజీలో ప్రేమలో పడిన ఒక అమ్మాయిని, ఆమె ప్రియుడు ఎలా తన అదుపులో ఉంచుకోవడానికి ప్రయత్నిస్తాడనే ఆసక్తికరమైన కథాంశంతో ఈ చిత్రం తెరకెక్కింది.

## ఉస్తాద్ భగత్ సింగ్ ..దమ్మున్నోడు దాటొచ్చు.. అదిరిపోయిన ట్రైలర్ టీజ్




పవర్ స్టార్ పవన్ కల్యాణ్, మాస్ డైరెక్టర్ హరీశ్ శంకర్ కాంబినేషన్‌లో తెరకెక్కుతున్న ప్రతిష్ఠాత్మక చిత్రం 'ఉస్తాద్ భగత్ సింగ్' నుంచి అభిమానులు ఎంతగానో ఎదురుచూస్తున్న అప్డేట్ వచ్చేసింది. సినిమా విడుదలకు సమయం దగ్గరపడుతుండటంతో ప్రమోషన్ల వేగాన్ని పెంచిన చిత్రబృందం, తాజాగా 'ట్రైలర్ టీజ్' పేరుతో ఓ చిన్న వీడియోను విడుదల చేసింది. ఈ వీడియో సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది.

ఈ టీజర్‌లో పవన్ కల్యాణ్ చెప్పిన డైలాగ్ హైలైట్‌గా నిలిచింది. "ఇందాక విన్నది భగవత్ గీత.. ఇది భగత్ గీత.. దమ్మున్నోడు దాటొచ్చు" అంటూ పవన్ తనదైన శైలిలో చెప్పిన డైలాగ్ ఫ్యాన్స్‌కు గూస్‌బంప్స్ తెప్పిస్తోంది. గబ్బర్ సింగ్ తర్వాత వీరిద్దరి కలయికలో వస్తున్న సినిమా కావడంతో అంచనాలు భారీగా ఉన్నాయి. ఇప్పటికే విడుదలైన పాటలు, పోస్టర్లు సినిమాపై హైప్‌ను పెంచగా, తాజా టీజర్ ఆ అంచనాలను నెక్స్ట్ లెవల్‌కు తీసుకెళ్లింది. తమన్ అందించిన బ్యాక్‌గ్రౌండ్ స్కోర్ వీడియోకు అదనపు బలాన్ని చేకూర్చింది.

మైత్రి మూవీ మేకర్స్ నిర్మిస్తున్న ఈ చిత్రంలో పవన్ సరసన శ్రీలీల, రాశి ఖన్నా హీరోయిన్లుగా నటిస్తున్నారు. ఉగాది కానుకగా మార్చి 19న ఈ చిత్రాన్ని ప్రపంచవ్యాప్తంగా గ్రాండ్‌గా విడుదల చేయనున్నట్లు మేకర్స్ ప్రకటించారు. ప్రస్తుతం సినిమా పనులు చివరి దశలో ఉన్నాయని, త్వరలోనే పూర్తి స్థాయి ట్రైలర్‌ను కూడా విడుదల చేయబోతున్నట్లు చిత్రబృందం తెలిపింది. మొత్తానికి మార్చి 19న థియేటర్లలో పండగ చేసుకోవడానికి పవన్ అభిమానులు సిద్ధమవుతున్నారు.

## 'దండోరా' ఇక్కడితో ఆగే సినిమా కాదు ..థాంక్యూ మీట్‌లో నటుడు శివాజీ




తెలంగాణ ప్రభుత్వం ప్రకటించిన 'గద్దర్ అవార్డులు 2025'లో 'దండోరా' చిత్రం తన సత్తాను చాటింది. ఉత్తమ చిత్రం సహా మొత్తం మూడు విభాగాల్లో ఈ సినిమా పురస్కారాలను గెలుచుకుంది. ఈ సందర్భంగా చిత్ర బృందం ఆదివారం హైదరాబాద్‌లో మీడియా సమావేశం (థాంక్యూ మీట్) నిర్వహించి, ప్రభుత్వానికి, జ్యూరీకి కృతజ్ఞతలు తెలియజేసింది. లౌక్య ఎంటర్‌టైన్‌మెంట్స్ పతాకంపై రవీంద్ర బెనర్జీ ముప్పానేని నిర్మించిన ఈ చిత్రానికి మురళీకాంత్ దర్శకత్వం వహించారు. శివాజీ, నవదీప్, నందు, బిందు మాధవి ప్రధాన పాత్రలు పోషించారు.

ఈ కార్యక్రమంలో నటుడు శివాజీ మాట్లాడుతూ.. "మా 'దండోరా' చిత్రాన్ని గుర్తించి అవార్డులు ఇచ్చిన జ్యూరీకి, తెలంగాణ ప్రభుత్వానికి ధన్యవాదాలు. ఎన్టీఆర్ గారు వేసిన ట్వీట్‌తో ఈ చిత్రం తెలుగు వారందరికీ దగ్గరైంది. ఈ చిత్రంలో అవకాశం ఇచ్చిన నిర్మాత బెన్నీ గారికి కృతజ్ఞతలు. ఇది తెలుగువాళ్ల ప్రతిభను, సత్తాను చాటే చిత్రం. ఈ సినిమాలోని పాత్ర కోసం, లుక్ కోసం చాలా రాత్రులు కేవలం రెండు, మూడు గంటలే నిద్రపోయేవాడిని. నటన నాకు దైవంతో సమానం. ఈ సినిమా ఇక్కడితో ఆగిపోయేది కాదు, మున్ముందు ఇంకా చాలా అవార్డులు వస్తాయని గట్టిగా నమ్ముతున్నాను" అని ధీమా వ్యక్తం చేశారు. దర్శకుడు మురళీకాంత్ మాట్లాడుతూ.. "కొత్త దర్శకుడినైనా నన్ను నమ్మి, నాకు మద్దతుగా నిలిచిన నా టీమ్‌కు థాంక్స్. శివాజీ గారి వల్లే ఈ చిత్రం ఈ స్థాయికి వచ్చింది. ఆయన ఎంతో సహకరించారు, కనీసం క్యారవ్యాన్ కూడా అడగలేదు. ఆయన లాంటి గొప్ప నటులు మనకు ఎంతో అవసరం. ఈ సినిమా చూసి ఎంతో మంది ఐఏఎస్, ఐపీఎస్‌లు వ్యక్తిగతంగా ఫోన్ చేసి అభినందించారు. ఇలాంటి గుర్తింపు మాకు మరింత ప్రోత్సాహాన్ని ఇస్తుంది" అని అన్నారు. సంగీత దర్శకుడు మార్క్ కె రాబిన్ మాట్లాడుతూ.. "చిన్నప్పటి నుంచి గద్దర్ అన్న పాటలు వింటూ పెరిగాను. ఈ రోజు ఆయన పేరు మీద ఉత్తమ సంగీత దర్శకుడిగా అవార్డు రావడం నాకు దక్కిన పెద్ద గౌరవంగా భావిస్తున్నాను" అని తన ఆనందాన్ని పంచుకున్నారు.

నిర్మాత రవీంద్ర బెనర్జీ మాట్లాడుతూ జ్యూరీ సభ్యులకు, ప్రభుత్వానికి, తమ ప్రయాణంలో తోడుగా నిలిచిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలిపారు. నటుడు నందు మాట్లాడుతూ.. సినిమా అనేది సమష్టి కృషి అని, భవిష్యత్తులో ఉత్తమ నిర్మాత కేటగిరీని కూడా చేర్చాలని ఆకాంక్షించారు. కాస్ట్యూమ్ డిజైనర్ రేఖ, నటి మనికా రెడ్డి కూడా తమ సంతోషాన్ని వ్యక్తం చేశారు. మొత్తంమీద, 'దండోరా' చిత్ర బృందం తమ సినిమాకు లభించిన ప్రభుత్వ గుర్తింపు పట్ల ఆనందం వ్యక్తం చేస్తూ, భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధిస్తామన్న నమ్మకాన్ని పంచుకుంది.

## ఇదే నిజమైతే.. అలా 'వారణాసి' రేర్ రికార్డు!



సినీ ప్రియులంతా ఆసక్తిగా ఎదురుచూస్తున్న చిత్రం 'వారణాసి' (Varanasi). హీరో మహేశ్‌బాబు (Mahesh Babu)- డైరెక్టర్ రాజమౌళి (Rajamouli) కాంబోలో తెరకెక్కుతున్న ఈ సినిమాపై ఇప్పటికే భారీ అంచనాలు నెలకొన్న సంగతి తెలిసిందే. ఓవర్సీస్‌లోనూ ఇదే క్రేజ్ కనిపిస్తోంది. దీన్ని దృష్టిలో పెట్టుకునే ఓ డిస్ట్రిబ్యూషన్ సంస్థ ఈ సినిమా ఓవర్సీస్ హక్కులకుగానూ (భారతీయ భాషలకు సంబంధించి) ఏకంగా రూ.160 కోట్ల ఆఫర్ ప్రకటించినట్లు సినీ వర్గాల్లో టాక్ వినిపిస్తోంది (varanasi overseas rights). దీనిపై చిత్ర బృందం ఇంకా తుది నిర్ణయం తీసుకోలేదని సమాచారం. ఒకవేళ ఇదే నిజమైతే.. ఓవర్సీస్ రైట్స్‌కుగానూ ఇన్ని రూ. కోట్లు దక్కించుకున్న తొలి భారతీయ సినిమా అవుతుంది. ఇదో రేర్ రికార్డు.

రొటీన్‌కు భిన్నంగా టైటిల్ గ్లింప్స్‌తోనే కథ, దాని స్థాయి ఎలాంటిదో ఆడియన్స్‌కు పరిచయం చేశారు రాజమౌళి. ఈ ఫాంటసీ-మైథలాజికల్ మూవీలో మహేశ్.. రాముడిగానూ కనిపించనున్నారు. మందాకినిగా ప్రియాంకా చోప్రా, కుంభ పాత్రలో పృథ్వీరాజ్ సుకుమార్ విలన్‌గా నటిస్తున్నారు. 2027 ఏప్రిల్ 7న ఈ సినిమా విడుదల కానుంది. 120+ దేశాల్లో ఈ సినిమాను విడుదల చేసేందుకు చిత్ర బృందం సన్నాహాలు చేస్తోంది. అత్యధిక దేశాల్లో రిలీజ్ అయిన భారతీయ సినిమాగానూ 'వారణాసి' నిలవనుంది.

# వరల్డ్ ఛాంపియన్ భారత్









టీ20 ప్రపంచకప్‌లో సరికొత్త చరిత్ర
.. న్యూజిలాండ్ పై అల్టిమేట్ విక్టరీ

**2007, 2024 తర్వాత మూడోసారి టీ20 ప్రపంచకప్ కైవసం చేసుకున్న భారత్**

**పొట్టి కప్‌ను డిఫెండ్ చేసుకున్న తొలి జట్టుగా టీమిండియా ప్రపంచ రికార్డు**

**ఫైనల్లో న్యూజిలాండ్‌పై 96 పరుగుల తేడాతో ఘన విజయం**

**బ్యాటింగ్‌లో సంజూ శాంసన్ (89), బౌలింగ్‌లో బుమ్రా (4/15) అద్భుత ప్రదర్శన**

**అహ్మదాబాద్ వేదికగా 255 పరుగుల భారీ స్కోరు నమోదు చేసిన భారత్**

మీ స్పందన ; టీ20 ప్రపంచకప్ ఫైనల్లో టీమిండియా మరోసారి విశ్వరూపం చూపించింది. అహ్మదాబాద్‌లోని నరేంద్ర మోదీ స్టేడియం వేదికగా ఆదివారం జరిగిన తుది పోరులో న్యూజిలాండ్‌ను చిత్తుచేసి విశ్వవిజేతగా నిలిచింది. ఈ విజయంతో భారత్ సరికొత్త చరిత్ర సృష్టించింది. 2007, 2024 తర్వాత ఇది టీమిండియాకు మూడో టీ20 వరల్డ్ కప్ కావడం విశేషం. మూడు సార్లు టీ20 వరల్డ్ కప్ గెలిచిన తొలిజట్టుగా టీమిండియా రికార్డు నెలకొల్పింది. దాంతోపాటే, ఆతిథ్య జట్టు వరల్డ్ కప్ నెగ్గడం కూడా ఇదే తొలిసారి. అంతేకాదు, టీ20 ప్రపంచకప్ చరిత్రలో డిఫెండింగ్ ఛాంపియన్‌గా బరిలోకి దిగి, టైటిల్‌ను నిలబెట్టుకున్న తొలి జట్టుగా టీమిండియా రికార్డులకెక్కింది. సొంతగడ్డపై జరిగిన ఈ మెగా ఫైనల్లో భారత్ ఏకంగా 96 పరుగుల తేడాతో న్యూజిలాండ్‌పై ఘన విజయం సాధించి ట్రోఫీని ముద్దాడింది. 256 పరుగుల భారీ లక్ష్యంతో బరిలోకి దిగిన న్యూజిలాండ్ ఏ దశలోనూ పోటీ ఇవ్వలేకపోయింది. భారత బౌలర్ల ధాటికి కివీస్ బ్యాటర్లు పెవిలియన్‌కు క్యూ కట్టారు. భారత పేస్ దళపతి జస్ప్రీత్ బుమ్రా తన మ్యాజిక్ బౌలింగ్‌తో కివీస్ పతనాన్ని శాసించాడు. కేవలం 15 పరుగులిచ్చి 4 కీలక వికెట్లు పడగొట్టి ప్రత్యర్థి నడ్డి విరిచాడు. న్యూజిలాండ్ ఇన్నింగ్స్‌లో వికెట్ కీపర్ టిమ్ సీఫెర్ట్ (52), కెప్టెన్ మిచెల్ శాంట్నర్ (43) మాత్రమే పోరాడారు. వీరిద్దరూ మినహా మిగిలిన బ్యాటర్లు ఎవరూ క్రీజులో నిలవలేకపోయారు. ముఖ్యంగా డారిల్ మిచెల్ (17), ఫిన్ అలెన్ (9), రచిన్ రవీంద్ర (1) వంటి స్టార్ ప్లేయర్లు విఫలమవడంతో కివీస్ 19 ఓవర్లలో 159 పరుగులకే ఆలౌట్ అయింది. భారత బౌలర్లలో బుమ్రా 4, అక్షర్ పటేల్ 3 వికెట్లు పడగొట్టగా.. హార్దిక్, వరుణ్ చక్రవర్తి, అభిషేక్ శర్మ తలో వికెట్ దక్కించుకున్నారు. అంతకు ముందు టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన భారత్.. న్యూజిలాండ్ బౌలర్లపై విరుచుకుపడింది. ఓపెనర్లు అభిషేక్ శర్మ, సంజూ శాంసన్ ఆకాశమే హద్దుగా చెలరేగారు. తొలి వికెట్‌కు వీరిద్దరూ కేవలం 7.1 ఓవర్లలోనే 98 పరుగులు జోడించి శుభారంభం అందించారు. అభిషేక్ శర్మ 21 బంతుల్లోనే 6 ఫోర్లు, 3 సిక్సర్లతో 52 పరుగులు చేసి మెరుపు ఇన్నింగ్స్ ఆడాడు. ఆ తర్వాత వచ్చిన ఇషాన్ కిషన్ (54)తో కలిసి సంజూ శాంసన్ స్కోరు బోర్డును పరుగులు పెట్టించాడు. ముఖ్యంగా శాంసన్ కివీస్ బౌలర్లను ఊచకోత కోశాడు. 46 బంతుల్లో 5 ఫోర్లు, ఏకంగా 8 సిక్సర్లతో 89 పరుగులు చేసి ఇన్నింగ్స్‌కు వెన్నెముకగా నిలిచాడు. చివర్లో శివమ్ దూబే (26 నాటౌట్) ధాటిగా ఆడటంతో భారత్ నిర్ణీత 20 ఓవర్లలో 5 వికెట్ల నష్టానికి 255 పరుగుల భారీ స్కోరు సాధించింది. సూర్యకుమార్ యాదవ్ డకౌట్ అయినా.. టీమిండియా సమిష్టి ప్రదర్శనతో మూడోసారి ప్రపంచకప్‌ను కైవసం చేసుకుంది.








## భారత్ వరల్డ్ కప్ సాధించిన సందర్భంగా....హోమ్ మంత్రి అమిత్ షా తో మంత్రి లోకేష్

## చెలరేగిన శివమ్ దూబె .. ఒకే ఓవర్‌లో 2 సిక్స్‌లు, 3 ఫోర్లు




భారత్, న్యూజిలాండ్ మధ్య జరుగుతున్న టీ20 ప్రపంచ కప్ ఫైనల్‌లో శివమ్ దూబె చెలరేగి ఆడాడు. ఇన్నింగ్స్ చివరి ఓవర్‌లో భారీ షాట్లతో విరుచుకుపడ్డాడు. ఒకే ఓవర్‌లో రెండు సిక్స్‌లు, మూడు ఫోర్లు బాదాడు. వీడియో చూడండి.

## ఇషాన్ కిషన్ కళ్లు చెదిరే క్యాచ్.. రచిన్ ఔట్



భారత్, న్యూజిలాండ్ మధ్య జరుగుతున్న టీ20 ప్రపంచ కప్ ఫైనల్‌లో ఇషాన్ కిషన్ చురుకైన ఫీల్డింగ్‌తో ఆకట్టుకున్నాడు. జస్ప్రీత్ బుమ్రా వేసిన 3.1వ ఓవర్‌లో రచిన్ రవీంద్ర (1) బ్యాట్‌ను బంతి ఎడ్జ్ తీసుకుంది. దీంతో ఫైన్ లెగ్‌లో ఉన్న ఇషాన్ కిషన్ అద్భుతంగా క్యాచ్ పట్టాడు.

## సంజు శాంసన్ హాఫ్ సెంచరీ .. హోరెత్తిన స్టేడియం



భారత్, న్యూజిలాండ్ మధ్య జరుగుతున్న టీ20 ప్రపంచ కప్ ఫైనల్‌లో సంజు శాంసన్ తన సూపర్ ఫామ్‌ను కొనసాగించాడు. ఈ టోర్నీలో వరుసగా మూడో అర్ధ సెంచరీ సాధించాడు. సంజు అర్ధ శతకం పూర్తి చేయగానే స్టేడియం హోరెత్తింది.

## అదరగొట్టిన అభిషేక్ .. 18 బంతుల్లోనే అర్ధ సెంచరీ



భారత్, న్యూజిలాండ్ మధ్య జరుగుతున్న టీ20 ప్రపంచ కప్ ఫైనల్‌లో అభిషేక్ శర్మ అదరగొట్టాడు. 18 బంతుల్లోనే అర్ధ సెంచరీ సాధించాడు. ఫామ్‌లో లేడంటూ వచ్చిన కామెంట్లకు చెక్ పెట్టాడు